నవతెలంగాణ
నమ్మదగిన తెలుగు దినపత్రిక
1
ఆదిలాబాద్
ఆదివారం | మే 19, 2024 | www.navatelangana.com

టీఎస్‌కు బదులుగా టీజీని వాడాలి

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

తెలంగాణ సంక్షిప్త పదాన్ని టీఎస్‌కు బదులుగా టీజీగా మార్చాలని ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసిందని కలెక్టర్ రాజర్షి షా శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. జీఓలు, నోటిఫికేషన్లు, నివేదికలు, లెటర్ హెడ్‌లలో టీజీగా ఉండాలని, ప్రభుత్వ శాఖలు, సంస్థలు, అటనామస్ విభాగాలన్నీ దీనిని పాటించాలని పేర్కొన్నారు. ఇప్పటివరకు వాహనాల రిజిస్ట్రేషన్‌కు మాత్రమే పరిమితమైన టీజీ నిబంధన ఇప్పుడు రాష్ట్ర వ్యాప్తంగా అన్ని అధికారిక వ్యవహారాలకు వర్తింపజేసేలా ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసిందని, తక్షణమే ఇది అమల్లోకి వచ్చిందని తెలిపారు. ప్రధాన కార్యదర్శి శాంతికుమారి ఆదేశాల మేరకు ఇకపైన 'టీఎస్' అబ్రివేషన్ స్థానంలో అధికారికంగా 'టీజీ' అని మార్చుకునేలా మే 30వరకు డెడ్‌లైన్ ఉందన్నారు. ఈ నెల 30వ తేదీలోగా సాధారణ పరిపాలన శాఖ జాయింట్ సెక్రటరీ (కోఆర్డినేషన్)కు రాతపూర్వకంగా (యాక్షన్ టేకెన్ రిపోర్టు) తెలియజేయాలని సీఎస్ తాజా ఉత్తర్వుల్లో పేర్కొన్నారని, ఈ సందర్భంగా అన్ని కార్యాలయాల్లో టీఎస్‌కు బదులు టీజీగా మార్చి 26వ తేదీ లోగా నివేదికలు అందజేయాలని పేర్కొన్నారు.

విలేకరిని బెదిరించిన వ్యక్తిపై కఠిన చర్యలు తీసుకోవాలి

నవతెలంగాణ-నిర్మల్

అక్రమంగా మొరం, మట్టి తవ్వకాలపై కథనం రాసిన నవతెలంగాణ సారంగాపూర్ విలేకరి లక్ష్మీనారాయణను బెదిరించిన వ్యక్తిపై కఠిన చర్యలు తీసుకోవాలని బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షులు ఎంబడి చంద్రశేఖర్ డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆయన శనివారం పత్రిక ప్రకటన విడుదల చేశారు. ప్రజల పక్షాన పోరాటం చేస్తున్న పాత్రికేయులను బెదిరింపులకు గురి చేయడం సరికాదన్నారు. లక్ష్మీనారాయణ నిజాయితీగా వార్తలు రాస్తుంటే జీర్ణించుకోలేక బెదిరింపులకు పాల్పడడం అప్రజాస్వామికమన్నారు. పోలీసులు వెంటనే సదరు వ్యక్తిపై కేసు నమోదు చేయాలని కోరారు.

విత్తన మాయ..!

- రాశి-659 రకం విత్తనాలకు భారీ డిమాండ్
- రైతులకు ఇచ్చేందుకు దుకాణదారుల ససేమిరా
- బ్లాక్‌లో అధిక ధరలకు విక్రయిస్తున్నట్లు ఆరోపణ
- అవసరమైనవి లభించక అన్నదాతల్లో ఆందోళన
- దృష్టి సారించని వ్యవసాయశాఖ అధికారులు

విత్తన కొనుగోళ్ల పర్వంలో అక్రమాలకు ఆస్కారం ఏర్పడుతోంది. ప్రతి ఏటా మాదిరిగానే ఈ ఏడాది సైతం దుకాణదారులు కృత్రిమ కొరత సృష్టిస్తున్నారు. అన్ని రకాల విత్తనాలు అందుబాటులో ఉన్నాయని అధికారులు చెబుతుండగా.. క్షేత్రస్థాయిలో మాత్రం లభించడం లేదు. రైతులకు అవసరమైనవి ఇవ్వకుండా.. అవసరంలేని వాటిని అంటగడుతున్నట్లు తెలుస్తోంది. ప్రస్తుతం రాసి-659 రకం విత్తనాలకు భారీగా డిమాండ్ ఉండటంతో అనేక మంది రైతులు వీటిని కొనుగోలుకు ఆసక్తి చూపుతున్నారు. కానీ డిమాండ్‌కు సరిపడా విత్తనాలు మార్కెట్‌లో లభించకపోవడంతో ఆందోళన చెందుతున్నారు. ఈ విత్తనాలకు దుకాణదారులు బ్లాక్ మార్కెట్‌లో అధిక ధరలకు విక్రయిస్తూ సొమ్ము చేసుకుంటున్నారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. మార్కెట్‌లో విత్తనాల కొరత వేధిస్తున్నా..వ్యవసాయశాఖ అధికారులు కనీసం అటు వైపు దృష్టిసారించడం లేదనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి.



నవతెలంగాణ- ఆదిలాబాద్ ప్రాంతీయ ప్రతినిధి, ఆదిలాబాద్ రూరల్

మరో ఇరవై రోజుల్లో వానాకాలం ప్రారంభం కాబోతోంది. ఖరీఫ్ సీజన్ కోసం ఇప్పటికే రైతులు సన్నద్ధమవుతున్నారు. దుక్కులు పూర్తిచేసి పొలాలను సిద్ధం చేశారు. వర్షాలు రాగానే విత్తనాలు విత్తేందుకు సిద్ధమవుతున్న తరుణంలో ప్రస్తుతం విత్తనాలు కొనేందుకు రైతులు మార్కెట్‌కు వెళ్తున్నారు. ప్రస్తుతం ఉమ్మడి జిల్లావ్యాప్తంగా ఎక్కడ చూసినా విత్తన దుకాణాల్లో రైతులు బారులు తీరి కనిపిస్తున్నారు. కానీ విత్తనాల కొరత వారిని ఆదిలోనే ఇబ్బందులు తెచ్చిపెడుతోంది. బహిరంగ మార్కెట్‌లో విత్తనాల కొరత వారిని తీవ్ర ఆందోళనకు గురిచేస్తోంది. ప్రస్తుతం ఎక్కువ మంది రైతులు రాసి-659రకం విత్తనాల కోసం ఆసక్తి చూపుతున్నారు. వీటి కోసం మార్కెట్‌కు వెళితే ఈ విత్తనాలు లేవని ఆయా దుకాణదారుల నుంచి సమాధానం రావడంతో అన్నదాతలు కంగుతింటున్నారు. ఈ విత్తనాలు కొరత ఉందని..వచ్చిన తర్వాత తీసుకోవాలని చెబుతున్నారు. మరోపక్క ఈ రకం విత్తన బ్యాగు కావాలంటే..ఇతర రకాల విత్తనాలు కూడా తీసుకుంటేనే లభిస్తాయని చెబుతున్నారు. దీంతో గత్యంతరం లేక ఇతర అవసరం లేని బ్యాగులు కూడా తీసుకుంటున్నట్లు తెలుస్తోంది.

బ్లాక్‌లో అధిక ధరలకు..?

ఆదిలాబాద్ జిల్లాలో సుమారు 4.16లక్షల ఎకరాల్లో పత్తి సాగు చేస్తారని వ్యవసాయశాఖ అంచనా వేసింది. ఇందుకు 10.52లక్షల విత్తన ప్యాకెట్లు అవసరం కానున్నాయి. విత్తనాల కోసం జిల్లావ్యాప్తంగా వివిధ ప్రాంతాల నుంచి అన్నదాతలు ఉదయమే జిల్లా కేంద్రానికి వస్తున్నారు. ఉదయం నుంచే ఆయా దుకాణాల ముందు వరుస కడుతున్నారు. రాసి-659 రకం విత్తనాలు ఉదయం పూట కొన్ని మాత్రమే లభిస్తున్నాయి. మిగతా వాటిని దుకాణదారులు విక్రయించడం లేదని రైతులు చెబుతున్నారు. ముఖ్యంగా రాసి రకం బ్యాగు కావాలంటే ఇతర రకాల బ్యాగులు తీసుకుంటేనే ఇస్తామని చెబుతుండటంతో రైతులు దిక్కుతోచని స్థితిని ఎదుర్కొంటున్నారు.

మరోపక్క దుకాణదారులు ఈ రకం విత్తనాలను అధిక ధరలకు బ్లాక్‌లో విక్రయిస్తున్నారనే ఆరోపణలున్నాయి. మహారాష్ట్ర నుంచి వచ్చే రైతులతో పాటు అధిక ధర వెచ్చించేందుకు ముందుకొచ్చిన వారికి వీటిని విక్రయిస్తున్నట్లు రైతులు ఆరోపిస్తున్నారు. ప్రస్తుతం ప్రభుత్వం ఈ రకం బ్యాగుకు రూ.864 చొప్పున విక్రయించాలని సూచించింది. బ్లాక్‌లో అధిక ధరలకు విక్రయిస్తున్నట్లు ఆరోపణలున్నాయి. మరోపక్క అధికారులు మాత్రం అన్ని రకాల విత్తనాలు అందుబాటులో ఉన్నాయని చెబుతుండగా.. క్షేత్రస్థాయిలో మాత్రం కృత్రిమ కొరత ఏర్పడటం విమర్శలకు తావిస్తోంది. రైతులు గత రెండు రోజుల నుంచి దుకాణాల ఎదుట పడిగాపులు కాస్తున్నా అధికార యంత్రాంగం దృష్టిసారించడం లేదు. బ్లాక్‌ల్లో విక్రయిస్తున్నారనే ఆరోపణలు వస్తున్నా కట్టడికి ఎలాంటి చర్యలు చేపట్టడం లేదనే వాదనలు వినిపిస్తున్నాయి.

అవసరమైన విత్తనాలు దొరకడం లేదు : భాస్కర్, రైతు, పెందల్‌వాడ



విత్తనాల కోసం ఉదయమే జిల్లా కేంద్రానికి వరుసలో నిల్చున్నాను. కానీ మాకు అవసరమైన రాసి-659రకం విత్తనాలు దొరకడం లేదు. ఈ విత్తనాలు కావాలంటే ఇతర రకాలను కూడా కొనుగోలు చేయాలని దుకాణదారులు చెబుతున్నారు. గత్యంతరం లేక కొనుగోలు చేయాల్సి వచ్చింది. అధికారులు దృష్టిసారించి మాకు అవసరమైన విత్తనాలు అందుబాటులో ఉంచడంతో పాటు తప్పనిసరిగా వాటిని విక్రయించేలా చర్యలు తీసుకోవాలి.

ప్రభుత్వ భూములు ఫలహారం..!

- కోట్ల రూపాయల భూములు కబ్జా
- ప్రభుత్వ భూములుగా రెవెన్యూ రికార్డులు

జిల్లాలో కోట్లరూపాయల విలువ గల ప్రభుత్వ భూములు ఫలహారం అవుతున్నాయి. అసైన్డ్, సీలింగ్, ఫ్రీడమ్ ఫైటర్స్, ప్రభుత్వ భూముల్ని కబ్జాదారులు అక్రమంగా రిజిస్ట్రేషన్లు చేయించుకుంటున్నారు. జిల్లా కేంద్రంతో పాటు లక్సెట్టిపేట్, నస్పూర్, మందమర్రి, జైపూర్ ప్రాంతాల్లోని ప్రభుత్వ భూముల్ని ప్రజాప్రతినిధుల సహకారంతో రియల్ ఎస్టేట్ వ్యాపారులు ఆక్రమించుకుంటున్నారు. ఆయా ప్రాంతాల్లో సీలింగ్, ప్రభుత్వ భూములు ఖాళీగా ఉండడం, కొత్తగా జిల్లా ఏర్పడడం, రహదారుల విస్తరణ, జిల్లా పలు రకాలుగా అభివృద్ధి కావడంతో వాటిపై కబ్జాదారులు కన్నేసి ఎంతకైనా తెగించి తమ సొంతం చేసుకుంటున్నారు.

నవతెలంగాణ-మంచిర్యాల

మంచిర్యాల పట్టణం జిల్లా కేంద్రంగా మారడంతో భూముల ధరలకు రెక్కలొచ్చాయి. గతంలో లక్షలు పలికిన భూముల రేటు ఒక్కసారిగా కోట్లు పలుకుతుండడంతో కబ్జాదారులు ఖాళీ స్థలాల ఆక్రమణను పనిగా పెట్టుకున్నారు. పవర్‌లో ఉన్న పార్టీకి చెందిన నాయకులు, అనుచరులే భూకబ్జాలకు వత్తాసు పలికారనే ఆరోపణలు ఉన్నాయి. అవినీతికి అలవాటుపడ్డ కొంత మంది అధికారులు సైతం వారికి అండగా ఉండి అక్రమాలను ప్రోత్సహించరనే విమర్శలు సైతం ఎన్నో ఉన్నాయి. ఇటు నాయకులు, అటు అధికారుల అండదండలతోనే కోట్లు విలువ చేసే ప్రభుత్వ, సీలింగ్, అసైన్డ్ భూములు అన్యాక్రాంతమయ్యాయి. ప్రభుత్వ భూములన్నీ కబ్జాకు గురవడంతో జిల్లాలో ఏదైన ప్రభుత్వ భవనం నిర్మించాలంటే స్థలం లేకుండా పోయింది.

మంచిర్యాల పట్టణంలోని ఆండాళమ్మ కాలనీ సమీపంలో సర్వే నెం.147లో ప్రభుత్వ రికార్డుల ప్రకారం 6.01(ఆరు ఎకరాల ఒక గుంట) ప్రభుత్వ భూమి ఉంది. ఆ భూమిని కబ్జా చేసిన ఓ రియల్ ఎస్టేట్ వ్యాపారి కొనుగోలుదారులకు గుంటల్లో రిజిస్ట్రేషన్ చేసి అమ్మేశాడు. అదే భూమిలో మరొక్క వ్యాపారి ఒక చిన్న ఇండస్ట్రియల్ కంపెనీని స్థాపించి బ్యాంక్ నుండి లోన్ తీసుకున్నాడు. ప్రభుత్వ భూమికి నాలా కన్వర్షన్ ఇచ్చిన అధికారులు, ప్రభుత్వ భూమిని గుంటల్లో రిజిస్ట్రేషన్ చేసిన సంబంధిత అధికారులపై జిల్లాకు చెందిన పౌర హక్కుల సంఘం నాయకుడు కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. దీనిపై కలెక్టర్ సమగ్ర విచారణకు ఆర్డీఓ, తహసీల్దార్‌ను ఆదేశించారు.

మందమర్రి మండలం తిమ్మాపూర్ గ్రామానికి చెందిన కొందరు అప్పట్లో అధికార పార్టీ నాయకుల అండ దండలతో కోట్ల రూపాయల విలువ చేసే ప్రభుత్వ భూముల్ని కబ్జా చేసినట్లు ఆరోపణలు, ఫిర్యాదులు ఉన్నాయి. తిమ్మాపూర్ విలేజ్ శివారులో గల సర్వే నెం.412లో పట్టా ల్యాండ్‌కు ఆనుకొని ఉన్న ప్రభుత్వ భూమి సర్వే నెం.410, 411ను కలుపుకొని నిర్మాణాలు చేపట్టారు. సర్వే నెం.396, 389/1/2/3 సీలింగ్ భూముల కింద రెవెన్యూ రికార్డుల్లో చుపిస్తున్నప్పటికీ ఆ సీలింగ్ భూముల్లో ఇండ్ల నిర్మాణాలు చేపట్టారు. ప్రభుత్వ రికార్డుల ప్రకారం సీలింగ్ భూముల్ని అమ్మడం, కొనడం నేరం. ఒకవేళ ఆ భూమిని ప్రభుత్వం ఎవరికైన అలాట్ చేస్తే ఆ సీలింగ్, ప్రభుత్వ భూమిని అతనే సాగు చేసుకోవాలి తప్ప భూమిలో నిర్మాణాలు చేపట్టేందుకు వీలు లేదు.



కలెక్టర్‌కు ఫిర్యాదు చేసిన మంచిర్యాలలోని సర్వే నెం.147లో గల ప్రభుత్వ భూమి

లక్సెట్టిపేట్ మండలం బలరావుపేట గ్రామంలో సర్వే నెం.320, 324, 327, 328లో 20.24 గుంటల ప్రభుత్వ భూమి ఉంది. గతంలో ప్రభుత్వం ఫ్రీడమ్ ఫైటర్స్‌కు 9.1గుంట అలాట్ చేసింది. దానికి అనుకోని ఉన్న 10.23గుంటల ప్రభుత్వ భూమిని ఆ మండలానికి చెందిన ప్రధాన నాయకుడు ఒకరు కబ్జా చేసి సాగు చేసుకుంటున్నారు. ఫ్రీడమ్ ఫైటర్స్‌కు ప్రభుత్వం ఇచ్చిన భూమితో పాటు మిగిలిన ప్రభుత్వ భూమిని సాగు చేసుకుంటూ ఫ్రీడమ్ ఫైటర్స్‌కు చెందిన ప్రభుత్వ భూమిలో నుండి 3గుంటల భూమిని తన వాళ్ల పేరు మీద రిజిస్ట్రేషన్ చేయించుకున్నట్లు కలెక్టరేట్‌కు ఫిర్యాదు రావడంతో అప్పటి జాయింట్ కలెక్టర్ రిజిస్ట్రేషన్ క్యాన్సల్ చేశారు.

తన వారికి రిజిస్ట్రేషన్ చేసిన భూమి రద్దు కావడంతో సదరు నాయకుడు కోర్టును ఆశ్రయించాడు. ఇటు ఫ్రీడమ్ ఫైటర్స్‌కు ప్రభుత్వం ఇచ్చిన భూమితో పాటు మిగిలిన ఉన్న ప్రభుత్వ భూమిని సైతం సాగు చేసుకుంటూ దాన్ని ఎలాగైనా సొంతం చేసుకునే ప్రయత్నంలో ఉన్నాడు. కబ్జాకు సంబంధించిన వివరాలు మొత్తం కలెక్టర్ కార్యాలయంలో ఉన్నట్టు సమాచారం.

దృష్టి కొస్తే చర్యలు తీసుకుంటాం : వి.రాములు, ఆర్డీఓ, మంచిర్యాల



ప్రభుత్వ భూములు కబ్జా అయినట్లు తమ దృష్టికి వస్తే చర్యలు తీసుకుంటాం. ప్రభుత్వ, సీలింగ్ భూముల్ని కబ్జా చేయాలని చూస్తే ఎవరినీ ఉపేక్షించేది లేదు. ఫిర్యాదుల నేపథ్యంలో విచారణ చేపట్టే బాధ్యత తమకు ఉంది.

ఇద్దరు వ్యక్తులు అదృశ్యం

నవతెలంగాణ-కాగజ్‌నగర్ రూరల్

కాగజ్‌నగర్ రూరల్ పోలీస్ స్టేషన్ పరిధిలోని వేరువేరు గ్రామాల్లో ఇద్దరు వ్యక్తులు అదృశ్యమైనట్టు ఫిర్యాదులు వచ్చాయని రూరల్ ఎస్సై సోనియా తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం... కోసిని గ్రామానికి చెందిన టేకం శంకర్ భీమన్న దేవర ఆలయ పూజారిగా పని చేస్తున్నారు. ఏప్రిల్ 3న ఇంటి నుంచి వెళ్లి తిరిగి రాలేదు. భట్టుపల్లి పంచాయతీలోని సీబాబుకాలనీకి చెందిన శనిగారపు దినేష్ ఈ నెల 4న ఇంటి నుంచి బయటకు వెళ్లిపోయాడు. వారి కోసం పరిసర గ్రామాల్లోని బంధువులు, స్నేహితుల ఇళ్లలో బాధితుల కుటుంబీకులు ఆరాతీసినా ఆచూకీ లభించలేదు. బాధిత కుటుంబీకుల ఫిర్యాదు మేరకు శనివారం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

తేనెటీగల దాడిలో ఒకరు మృతి

నవతెలంగాణ-రెబ్బెన

మండలంలోని గోలేటిలో తేనెటీగల దాడిలో ఒకరు మృతి చెందిన సంఘటన జరిగింది. గోలేటిలోని భీమన్న ఆలయ పాత పూజారి అయిన పోషం శనివారం ఆలయంలో పూజలు చేస్తున్నారు. ఈ క్రమంలోనే తేనెటీగాలు దాడి చేయడంతో అక్కడిక్కడే మరణించారు.

ఘనంగా కన్యకా పరమేశ్వరి జన్మదిన ఉత్సవాలు

నవతెలంగాణ-కాగజ్‌నగర్

పట్టణంలోని శ్రీ వాసవి కన్యకాపరమేశ్వరి పంచాయతన క్షేత్రంలో శనివారం కన్యకా పరమేశ్వరి జన్మదిన ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. పట్టణ ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో పండితులు బాచంపల్లి కమలాకర్ శర్మ మంత్రోచ్ఛారణ మధ్య ఉదయం 5-30 నుండి ఈ ఉత్సవాలను నిర్వహించారు. పంచామృత, పంచఫలరస, సుగంధ ద్రవ్య అభిషేకం, స్వర్ణ శాటికాలంకరణ, అష్టోత్తర కుంకుమ పూజ, చండీహోమం కార్యక్రమాలు నిర్వహించారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని ఆర్యవైశ్యుల దాతల సహకారంతో తయారుచేసిన రెండు కిలోల బంగారు చీరను కన్యకా పరమేశ్వరి అమ్మవారికి బహుకరించి అలంకరించారు. తెలంగాణవ్యాప్తంగా రెండు కిలోల బంగారు చీరను బహుకరించిన ఘనత ఈ జిల్లాకే దక్కిందని ఈ సందర్భంగా ఆర్యవైశ్య నేతలు తెలిపారు. సాయంత్రం ఆరున్నరకు శాంతి కళ్యాణం, మంగళహారతి, మంత్రపుష్పం కార్యక్రమాలను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు గర్రెపల్లి గోపాల్, ప్రధాన కార్యదర్శి తూడూరు కృష్ణమూర్తి, కోశాధికారి కొలిపాక వెంకటేశ్వర్, ఉపాధ్యక్షులు గజ్జెల సురేష్, గౌరవాధ్యక్షులు మైలారపు మురళీధర్, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ గణపురం శ్రీనివాస్, చిలువేరు కమలాకర్, పాలెపు మురళీధర్ పాల్గొన్నారు.

పోస్టాఫీస్ ఎదుట రైతుల ఆందోళన

- పురుగులమందు డబ్బాలతో నిరసన
- అధికారుల హామీతో ఆందోళన విరమణ



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

పత్తి విక్రయించిన డబ్బులు చెల్లించాలని రైతులు జిల్లా కేంద్రంలోని ప్రధాన పోస్టాఫీసు ఎదుట శనివారం ఆందోళన చేపట్టారు. పురుగులమందు డబ్బాలు చేతపట్టుకొని నిరసనకు దిగారు. మూడు నెలల క్రితం రైతులను నమ్మించి పోస్టల్ ఖాతాలో ఉన్న పత్తి విక్రయించిన డబ్బులను ఆదిలాబాద్ పోస్టాఫీస్ పేమెంట్ బ్యాంక్ మేనేజర్ తన ఖాతాల్లోకి మళ్లించుకొని మాయం చేశారు. రైతుల ఖాతాల్లో డబ్బులు జమ కాకపోవడంతో అనుమానం వచ్చిన రైతులు పోస్టాఫీస్‌కు వెళ్లి నిలదీయగా మేనేజర్ కాజేసిన విషయం బహిర్గతమైంది. ఈ విషయమై కేసు నమోదు చేసిన పోలీసులు సదరు మేనేజర్‌ను అదుపులోకి తీసుకొని అరెస్టు చేశారు. మూడు నెలలకు తమ డబ్బులు తమకు రావడం లేదని.. ఖాతాల నుంచి మాయమైన డబ్బులు ఇంకా జమ కాకపోవడంతో రైతులు ఆందోళన బాటపట్టారు. పురుగులమందు డబ్బాలు తీసుకొని పోస్టాఫీసుకు వచ్చారు. విషయం తెలుసుకున్న పోస్ట్ ఆఫీసు సిబ్బంది జీఎం జనార్దన్‌తో ఫోన్లో మాట్లాడించారు. ఈ నెల ఆఖరులోగా లేదా వచ్చే నెలలో డబ్బులు ఖాతాల్లో జమ అవుతాయని ఆయన భరోసా ఇచ్చారు. కానీ ఆయన మాటలను నమ్మని రైతులు నిరసన కొనసాగించారు. పోలీసులు అక్కడి చేరుకొని రైతులను సముదాయించడంతో ఆందోళన విరమించారు. ఈ సందర్భంగా బాధిత రైతు అల్లూరి రమాకాంత్‌రెడ్డి మాట్లాడుతూ పత్తి అమ్మిన డబ్బులను పోస్టాఫీసు మేనేజర్ కాజేసి నాలుగు నెలలు గడుస్తోందని, ఇప్పటి వరకు వాటిని రికవరీ చేసి తమకు అందజేయడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. రేపుమాపు అంటూ అధికారులు కాలం వెళ్లదీస్తున్నారని తెలిపారు. ఖరీఫ్ పంటల సాగుకు చేతిలో డబ్బులు లేక సాగు చేయని పరిస్థితి ఉందన్నారు. 79 మంది మోసపోయామని, త్వరలోనే తమ డబ్బులు తమకు ఇప్పించాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో ఆర్‌బీఐ ఎదుట ధర్నా నిర్వహిస్తామని స్పష్టం చేశారు. అధికారులకు సానుకూలంగా స్పందిస్తున్నా డబ్బులు మాత్రం రావడం లేదన్నారు. షాడో అకౌంట్ చేశారని, అందులో డబ్బులు ఉన్నట్లు చూపిస్తున్నా తీయలేని పరిస్థితి ఉందని రైతులు వాపోయారు.

గ్రూప్-1 పరీక్ష నిర్వహణకు పకడ్బందీ చర్యలు



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

జిల్లాలో గ్రూప్-1 పరీక్ష నిర్వహణకు పకడ్బందీగా చర్యలు చేపట్టినట్లు కలెక్టర్ రాజర్షి షా తెలిపారు. జూన్ 9న నిర్వహించనున్న తెలంగాణా స్టేట్ పబ్లిక్ సర్వీస్ కమిషన్(టీఎస్‌పీఎస్సీ) గ్రూప్-1 ప్రిలిమినరీ పరీక్షల ఏర్పాట్లపై టీఎస్‌పీఎస్సీ చైర్మన్ ఎం.మహేందర్‌రెడ్డి శనివారం గూగుల్ మీట్ ద్వారా అన్ని జిల్లాల కలెక్టర్లు, ఎస్పీలు, నోడల్ అధికారులతో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ రాజర్షి షా పాల్గొన్నారు. ఈ సందర్భంగా చైర్మన్ మహేందర్‌రెడ్డి మాట్లాడుతూ గ్రూప్-1 ప్రిలిమినరీ పరీక్షకు అన్ని ఏర్పాట్లు చేయాలన్నారు. పరీక్ష ఉదయం 10.30 నుండి మధ్యాహ్నం 1గంట వరకు ఉంటుందని తెలిపారు. పరీక్ష రాసే అభ్యర్థులు ఉదయం 9గంటల లోపే పరీక్ష కేంద్రాలకు చేరుకోవాలని, 9.30 గంటలకు బయోమెట్రిక్ హాజరు మొదలవుతుందని తెలిపారు. పరీక్ష ప్రశాంతంగా పారదర్శకంగా జరిగేలా కలెక్టర్లు, ఎస్పీలు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని సూచించారు. నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే మాత్రం కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. తగిన నిఘా వ్యవస్థను కూడా ఏర్పాటు చేసుకోవాలని, దీనికి సీసీ కెమెరాలు అమర్చాలని సూచించారు.

పరీక్ష కోసం 18 కేంద్రాలు

కలెక్టర్ రాజర్షి షా మాట్లాడుతూ జిల్లాలో గ్రూప్-1 ప్రిలిమినరీ పరీక్షకు 18 పరీక్ష కేంద్రాలను, ఓ రీజనల్ సెంటర్‌ను ఏర్పాటు చేశామని తెలిపారు. పరీక్షకు 6,729 మంది అభ్యర్థులు హాజరుకానున్నారన్నారు. ఇందుకు రూట్ ఆఫీసర్లు 5 గురు, బయోమెట్రిక్ ఇన్విజిలేటర్‌లు, అబ్జర్వర్లు, ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలను, సిబ్బందిని నియమించామని తెలిపారు. స్ట్రాంగ్ రూమ్, సెక్యూరిటి, పరీక్షా కేంద్రాల్లో అన్ని వసతులు ఏర్పాటు చేస్తామన్నారు. 144 సెక్షన్ అమలులో ఉంటుందన్నారు. గూగుల్ మీట్‌లో అదనపు కలెక్టర్ శ్యామలదేవి, ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డా.అచ్చి శ్రీనివాస్ పాల్గొన్నారు.

పేద అభ్యర్థులకు పూర్తి సహకారం



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

సివిల్స్‌కు సన్నద్ధం అవుతున్న పేద అభ్యర్థులకు తమ వంతుగా పూర్తి సహకారం అందిస్తామని డాక్టర్ బీఎస్ రావ్ హెల్త్ ఫౌండేషన్ చైర్మెన్ డాక్టర్ బీఎస్‌రావ్ అన్నారు. శనివారం ఎస్సీ స్టడీ సర్కిల్‌లో అభ్యర్థులకు జనరల్ నాలెడ్జ్ పుస్తకాలను పంపిణీ చేశారు. ఉచితంగా అందించే పుస్తకాలను సద్వినియోగం చేసుకుంటు ప్రభుత్వ కొలువులు సాధించాలని ఆయన ఆకాంక్షించారు. ఈ సందర్భంగా డాక్టర్ బీఎస్ రావ్ మాట్లాడుతూ ఇప్పటికే కరీంనగర్, నిజామాబాద్ తదితర జిల్లాల్లో ఆరోగ్య పరంగా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సివిల్స్‌కు సన్నద్ధం అవుతున్న పేద అభ్యర్థులకు తోడ్పాటు అందించాలనే ఉద్దేశంతో నిపుణులతో జనరల్ నాలెడ్జ్ పుస్తకాలను రూపొందించామన్నారు. వాటిని అభ్యర్థులు సద్వినియోగం చేసుకుంటు రాణించాలని తెలిపారు. కార్యక్రమంలో స్టడీ సర్కిల్ డైరెక్టర్ రమేష్, విశ్రాంత లెక్చరర్ విజయబాబు పాల్గొన్నారు.

అఖిల భారతీయ అయ్యప్ప ధర్మప్రచార సభ కార్యవర్గం ఎన్నిక

కాగజ్‌నగర్ : అఖిల భారతీయ అయ్యప్ప ధర్మ ప్రచార సభ జిల్లా కార్యవర్గాన్ని శనివారం స్థానిక అయ్యప్ప ఆలయంలో ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షులుగా ఈదుపల్లి జ్యోతిష్, ఉపాధ్యక్షులుగా ఊట్ల సుధాకర్, ప్రధాన కార్యదర్శిగా విజయ్‌కుమార్, కోశాధికారిగా కారం సాయికృష్ణ, సంయుక్త కార్యదర్శిగా ఎం వెంకటరమణ, వాలంటీర్స్ కమాండెంట్‌గా ఎం. వెంకట్‌గౌడ్, జిల్లా పీఆర్‌ఓగా ఎం సత్యనారాయణ, సభ్యులుగా ఎనిమిది మందిని ఎన్నుకున్నారు. ఈ ఎన్నికకు ముఖ్య అతిథులుగా తమిళనాడు రాష్ట్ర కార్యదర్శి అనిష్‌కుమార్, జాతీయ కార్యవర్గసభ్యులు కొండు శ్రీనివాస్, రాష్ట్ర కార్యవర్గసభ్యులు ఎనగంటి భిక్షపతి, రాష్ట్ర ఉపాధ్యక్షులు పోతురాజుల రమేష్ హాజరయ్యారు.



నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
ఆదిలాబాద్-నిర్మల్
ఆదివారం | మే 19, 2024 | www.navatelangana.com

ఉపాధి హామీ పనుల పరిశీలన

నవతెలంగాణ-లోకేశ్వరం

మండలంలోని రాయపూర్ కాండ్లి గ్రామంలోని జారుడు బండ కుంటలో నిర్వహిస్తున్న ఉపాధి హామీ పనులను శనివారం గ్రామ పంచాయతీ కార్యదర్శి నారాయణ, టీఏ మంజుల, ఎఫ్ఏ సాయన్నలు పరిశీలించారు. ఈ సందర్భంగా పంచాయతీ కార్యదర్శి నారాయణ మాట్లాడుతూ జిల్లాలో



అధిక ఉష్ణోగ్రతలు నమోదవుతున్న సందర్భంగా ఉపాధి కూలీలు అందరూ ఉదయం తొందరగా వచ్చి 10 గంటల లోపే పనులు ముగించుకోవాలని వడదెబ్బ బారిన పడకుండా ఓఆర్ఎస్ ప్యాకెట్స్‌ని వెంట తెచ్చుకోవాలని, చిన్న పిల్లలను ఉపాధిహామీ పనులకు తీసుకురావద్దని కూలీలకు తెలియజేశారు.

షోకాజ్ నోటీస్ నుంచి పేర్లను తొలగించాలి

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

ఇటీవల జరిగిన పార్లమెంట్ ఎన్నికల విధుల్లో భాగంగా బోథ్ నియోజకవర్గంలో ఎన్నికల విధులు నిర్వహించినప్పటికీ ఎన్నికల అధికారుల నుంచి షోకాజ్ నోటీసులు జారీ చేయడం జరిగిందని పీఆర్టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి నర్ర నవీన్ యాదవ్, జిల్లా కోశాధికారి షేక్ ముజీబ్ అన్నారు. ఈ విషయమై శనివారం జిల్లా అదనపు కలెక్టర్ శ్యామలదేవిని కలెక్టరేట్‌లో కలిసి వినతిపత్రం అందజేశారు. ఎన్నికల విధులు నిర్వహించిన వారి పేర్లు షోకాజ్ నోటీసుల నుంచి తొలగించాలని విన్నవించారు.



గ్రూప్-1 ప్రిలిమినరీ పరీక్షకు పకడ్బందీగా ఏర్పాట్లు

- నిర్మల్ కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్

నవతెలంగాణ-నిర్మల్

జిల్లాలో గ్రూప్-1 ప్రిలిమినరీ పరీక్షను పకడ్బందీగా నిర్వహించడానికి పటిష్ట చర్యలు తీసుకుంటున్నామని జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ తెలిపారు. శనివారం హైదరాబాద్ నుంచి టీఎస్పీఎస్సీ చైర్మెన్ మహేందర్ రెడ్డి జిల్లాల కలెక్టర్లు, ఎస్పీలు, ఉన్నత అధికారులతో గ్రూప్ -1 పరీక్ష నిర్వహణకు తీసుకోవాల్సిన చర్యలపై వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా టీఎస్పీఎస్సీ చైర్మెన్ మాట్లాడుతూ గ్రూప్-1 పరీక్షను అత్యంత పకడ్బందీగా నిర్వహించాలని ఆదేశించారు. ఎలాంటి మాస్ కాపీయింగ్, లీకేజీలకు తావులేకుండా పరీక్షను నిర్వహించాలని, జిల్లాలలో పరీక్షా కేంద్రాల ఎంపికను పూర్తిచేసి, నిర్వహణ భాద్యతలను స్థానిక సంస్థల అదనపు కలెక్టర్లకు అప్పగించాలని కలెక్టర్లకు సూచించారు. సంబంధిత అధికారులంతా పరీక్షాకేంద్రాలను సందర్శించి ఫర్నిచర్, సీసీ కెమెరాలు, తాగునీరు, విద్యుత్ వంటి సౌకర్యాలను తనిఖీ చేయాలని సూచించారు. పరీక్ష జరిగే సమయంలో పరీక్షా కేంద్రం సమీపంలో జిరాక్స్ కేంద్రాలు మూసివేయాలని, కేంద్రాలకు మూడు కిలోమీటర్ల పరిధిలోపల 144 సెక్షన్ విధించాలని ఆదేశించారు. పరీక్ష కేంద్రాలకు ప్రశ్నాపత్రాలు, ఓఎంఆర్ పత్రాల తరలింపు సమయంలో పోలీసు శాఖ పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని సూచించారు. ప్రతి పరీక్ష కేంద్రంలో పోలీసు భద్రతను కల్పించాలని, పరీక్షా కేంద్రాలలోనికి సిబ్బందికి, అభ్యర్థులకు మొబైల్ ఫోన్, ఏ ఇతర ఎలక్ట్రానిక్ వస్తువులు అనుమతిలేదన్నారు. విద్యార్థులు సమయానికి పరీక్ష కేంద్రాలకు చేరుకునేలా ఆయా రూట్లలో ఆర్టీసీ ప్రత్యేక బస్సులను నడపాలని ఆదేశించారు. పరీక్ష సమయంలో నిరంతరం విద్యుత్ సరఫరా చేయాలనీ విద్యుత్ శాఖ అధికారులకు సూచించారు. పరీక్ష కేంద్రాల వద్ద అత్యవసర వైద్య సిబ్బంది మందులు, ఓఆర్ఎస్ ప్యాకెట్స్‌లను అందుబాటులో ఉంచాలని అన్నారు. పరీక్ష నిర్వహణలో ఎటువంటి లోపాలు తలెత్తకుండా అధికారులంతా సమన్వయంతో పనిచేసి పరీక్షలను ప్రశాంతంగా జరిగేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ మాట్లాడుతూ జూన్ 9న నిర్వహించే గ్రూప్-1 పరీక్షకు జిల్లాలో అన్ని ఏర్పాట్లు చేస్తున్నామని తెలిపారు. జిల్లాలోని 13 పరీక్షా కేంద్రాలలో 4,608 మంది అభ్యర్థులు పరీక్ష రాయనున్నారని తెలిపారు. సీసీ కెమెరాల ఏర్పాటుతో పాటు పరీక్షా కేంద్రాల వద్ద పటిష్ట పోలీసు



బందోబస్తు నిర్వహిస్తామని అన్నారు. ప్రశాంత వాతావరణంలో పరీక్షా నిర్వహించడానికి పటిష్ట చర్యలు తీసుకుంటున్నట్లు వివరించారు. ఫ్లైయింగ్ స్క్వాడ్, రూట్ ఆఫీసర్లను నియమిస్తామని తెలిపారు. అభ్యర్థుల సందేహాల నివృత్తికి జిల్లా కలెక్టర్ కార్యాలయంలో హెల్ప్ లైన్‌ను ఏర్పాటు చేశామని తెలిపారు. అభ్యర్థులకు ఏవైనా సందేహాలుంటే టోల్ ఫ్రీ నంబర్ 6305646600 ను సంప్రదించాలని సూచించారు. ఈ సమావేశంలో రీజినల్ కోఆర్డినేటర్ పి.గంగారెడ్డి, డీఈఓ రవీందర్‌రెడ్డి, డీఎంహెచ్ఓ ధన్‌రాజ్, ఆర్టీసీ డిపోమేనేజర్ ప్రతిమారెడ్డి, డీపీఆర్వో విష్ణువర్ధన్, ఏఓ కలెక్టరేట్ సూర్యరావ్, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

నీరు నిల్వ ఉండకుండా చర్యలు తీసుకోవాలి

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

వర్షకాలం సమీపిస్తున్న నేపథ్యలో మురికి కాలువల్లో నీరు నిల్వ ఉండకుండా ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని మున్సిపల్ కమిషనర్ ఎండీ. ఖమర్ అహ్మద్ అన్నారు. శనివారం పట్టణంలోని పంజాబ్‌చౌక్‌లో పెద్ద మురికి కాలువలను సిబ్బందితో కలిసి శుభ్రం చేయించారు. అనంతరం చుట్టూ పక్కల షాపుల యాజమనులకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా మున్సిపల్ కమిషనర్ ఎండీ. ఖమర్ అహ్మద్ మాట్లాడుతూ వర్ష కాలం సమీపిస్తున్న నేపథ్యంలో నీరు కాలనీల్లో వెళ్లకుండా మురికి కాలువలను శుభ్రం చేయిస్తున్నామన్నారు. ఈనెల 6వ తేది నుంచి పూడికతీత పనులు కొనసాగిస్తున్నట్లు తెలిపారు. షాపుల యాజమనులు మురికి కాలువల్లో చెత్త వేస్తున్నారని, అలా వేస్తే జరిమాన వేస్తామన్నారు. కాలనీ ప్రజలు కూడా ప్లాస్టిక్‌ను మున్సిపల్ వాహనంలో వేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సానిటరీ ఇన్స్‌పెక్టర్ నరేందర్, సిబ్బంది కాంతారావ్ ఉన్నారు.

కిక్ బాక్సింగ్ పోటీలో రాణిస్తున్న విద్యార్థికి ఆర్థిక సాయం



నవతెలంగాణ-ఖానాపూర్

ఖానాపూర్ మండలంలోని సింగపూర్ గ్రామానికి చెందిన నాగలక్ష్మి అనే విద్యార్థి కిక్ బాక్సింగ్ పోటీల్లో రాణిస్తూ నేషనల్ ఛాంపియన్ షిప్‌కు ఎంపికైంది. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ తమ పార్టీ నాయకులతో రూ.20వేల ఆర్థిక సాయాన్ని అందజేశారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ మండలాధ్యక్షులు దొనికేని దయానంద్ ఈ నగదును నాగలక్ష్మికి అందజేశారు. నాగలక్ష్మి కిక్ బాక్సింగ్ పోటీల్లో రాణిస్తూ ఇంకా ఇలాంటివి ఎన్నో సాధించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఆకుల వెంకట్‌గౌడ్, ఖానాపూర్ పట్టణాధ్యక్షులు నిమ్మల రమేష్, జంగిలి శంకర్, మేడంపల్లి సర్పంచ్ రాజు నాయక్, యూత్ కాంగ్రెస్ మండలాధ్యక్షులు పోలంపల్లి సచిన్ నాయకులు సుజాత, మాధవ్, హైదర్, శంకర్, చరణ్, సింగపూర్ గ్రామస్తులు పాల్గొన్నారు.

ఈఏపీసెట్ ఫలితాల్లో ఎస్ఆర్ విద్యార్థుల ప్రతిభ

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

తెలంగాణలో ఇంజినీరింగ్, ఫార్మసీ, అగ్రికల్చర్ కోర్సుల్లో ప్రవేశాలకు నిర్వహించిన ఈఏపీసీఈటీ పరీక్ష ఫలితాలు శనివారం విడుదలయ్యాయి. ఈ ఫలితాల్లో ఆదిలాబాద్ ఎస్ఆర్ కళాశాల విద్యార్థులు ఉత్తమ ర్యాంకులు సాధించారు. దోటి అనిష్ 3210, కనక ఓం ఆదిత్య 6272, పాదటి అను 6634, దోటి ఆదిత్య 7019, దొడ్డి చందు 7775, దహిపల్లి కృష్ణ 817తో పాటుగా 34 మంది విద్యార్థులు 20,000 లోపు ర్యాంకులు సాధించారు. ఈ పరీక్ష రాసిన విద్యార్థులందరు ఇంజనీరింగ్‌లో అర్హత సాధించారు. ఈ సందర్భంగా ఉత్తమ ప్రతిభ కనబర్చిన విద్యార్థులను శుక్రవారం కళాశాలలో చైర్మెన్ వరదారెడ్డి, డైరెక్టర్స్ సంతోష్‌రెడ్డి, మధుకర్‌రెడ్డి, జోనల్ ఇన్‌చార్జి శ్రీనివాస్‌రెడ్డి, ప్రిన్సిపల్స్ కే.బ్రహ్మం, జయపాల్ రెడ్డి, అరవింద్ లెక్చరర్స్ పుష్పగుచ్చాలు అందించి అభినందనలు తెలిపారు.

రైతులకు అండగా ఉంటా..



నవతెలంగాణ-తాంసి

రైతులకు అండగా ఉండే బాధ్యత నాదని, మీరు అధైర్య పడోద్దని ఎమ్మెల్యే అనిల్ జాదవ్ అన్నారు. శనివారం మండల కేంద్రంలోని వ్యవసాయ సబ్ మార్కెట్ యార్డులో జొన్నల కొనుగోళ్లను పరిశీలించారు. మొదటగా వ్యవసాయ సహకార సంఘం సొసైటీ సిబ్బంది ఎమ్మెల్యేను శాలువాతో సన్మానించారు. అనంతరం రోడ్డుకు ఇరువైపులా జొన్న కుప్పలు పోయడంతో వర్షం పడితే తడిసి పోతున్నాయని అన్నారు. మార్కెట్ యార్డులో కనీస సౌకర్యాలు లేకపోవడంతో చాలా ఇబ్బందులకు గురవుతున్నామని అన్నారు. మార్కెట్ యార్డులో స్థలం ఉన్నప్పటికీ షెడ్లు లేకపోవడంతో పంటలు తడిసిపోయి నష్టపోతున్నామని అన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ అకాల వర్షాల కారణంగా చేతికందిన జొన్న పంట తడిసి పోవడం వాస్తవమే కానీ తడిచిన ధాన్యాన్ని ప్రభుత్వం కొనుగోలు చేయాలని అన్నారు. ఎట్టి పరిస్థితుల్లో రైతులకు ఇబ్బంది కలగకుండా చూసుకోవాలని, సొసైటీ సీఈఓను ఆదేశించారు. కొన్ని మార్కెట్ యార్డ్ నుంచి గోదాంకు వెళ్లిన జొన్నలను అధిక తేమ కారణంగా తిరిగి మార్కెట్ యార్డ్‌కు పంపించొద్దని, సంబంధిత అధికారులకు ఫోన్ ద్వారా తెలియజేశారు. మరికొన్ని రోజుల్లో మార్కెట్ యార్డ్ స్థలం పరిశీలించి, షెడ్డు నిర్మాణం చేపట్టడం జరుగుతుందని వచ్చే సీజన్ వరకు షెడ్డు నిర్మాణం పూర్తి చేయడంతో పాటు అన్ని సౌకర్యాలు కల్పించడం జరుగుతుందని అన్నారు. మార్కెట్ యార్డులో అన్ని సౌకర్యాలు కల్పించడం జరుగుతుందన్నారు రైతులు ఆందోళనకు గురికాకుండా తమ పంటలను విక్రయించుకోవాలని అన్నారు. దళారీలను నమ్మి మోసపోవద్దని అన్నారు. దళారీల పంటలను ఈ సబ్ మార్కెట్ యార్డులో కొనుగోలు చేయవద్దని సూచించారు. ఈ కార్యక్రమంలో సీఈఓ కేశవ్, నాయకులు కృష్ణ, గోవర్ధన్‌రెడ్డి, రజనీకాంత్, వినోద్‌రెడ్డి, మహేందర్, అశోక్, రఘు, కేదారీశ్వర్‌రెడ్డి, భగవాండ్లు, ఉత్తం, సొసైటీ సిబ్బంది, నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

23, 25 తేదీలలో స్పాట్ అడ్మిషన్ల కోసం కౌన్సెలింగ్

నవతెలంగాణ-ఉట్నూర్

ఉమ్మడి అదిలాబాద్ జిల్లాలోని గిరిజన గురుకుల కళాశాలలో ఇంటర్ ప్రథమ సంవత్సరంలో స్పాట్ అడ్మిషన్ల కోసం కౌన్సెలింగ్ నిర్వహించనునట్టు ఐటీడీఏ పీఓ ఖుష్బు గుప్త శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉట్నూర్‌లోని కేబీ కాంప్లెక్స్‌లో ఈనెల 23న బాలికలకు గిరిజన గురుకుల బాలికల కళాశాల, బాలురులకు ఈ నెల 25న లాల్ టెక్డి గురుకుల కళాశాలలో కౌన్సెలింగ్ ఉంటుందన్నారు. ఆసక్తి గల అభ్యర్థులు నాలుగు పాస్ ఫోటో సైజ్‌తో పాటు సంబంధించిన అన్ని ధృవ పత్రాలు తీసుకురావాలని కోరారు.

విద్యార్థిని మల్లీశ్వరిని సన్మానించిన ఎమ్మెల్యే

నవతెలంగాణ-తలమడుగు

మండలంలోని బరంపూర్ గ్రామానికి చెందిన మాదూరి మల్లన్న కుమార్తె మాదూరి మల్లీశ్వరి గత సంవత్సరం పదో తరగతి ఫలితాల్లో తలమడుగు మండల టాపర్‌గా నిలువగా ఈ సంవత్సరం ఇంటర్ మొదటి సంవత్సరంలో



కాలేజి టాపర్ నిలువడంతో శనివారం విషయం తెలుసుకున్న బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాధవ్, మల్లీశ్వరిని శాలువాతో సన్మానించి అభినందించారు. అదేవిధంగా ముందు ఇష్టంతో కష్టపడి చదివి ఉన్నత స్థాయికి చేరాలని అన్నారు. గ్రామస్తులు కేదారీశ్వర్‌రెడ్డి, మాదూరి సంటెన్న, మల్లేష్, రంజిత్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, రమాకాంత్, గ్రామస్తులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ ధర్నాలు చేయడం సిగ్గుచేటు

నవతెలంగాణ-ఖానాపూర్

రైతుల కోసం బీఆర్ఎస్ ధర్నాలు చేయడం సిగ్గుచేటని కాంగ్రెస్ ఎస్టీ సెల్ నిర్మల్ జిల్లా అధ్యక్షులు బాణావత్ గోవింద్ నాయక్ శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. జిల్లాలో ధాన్యం కొనుగోళ్లు చేపట్టాలని తడిసిన ధాన్యం కూడా కొనుగోలు చేయాలని సీఎం రేవంత్‌రెడ్డి ఇప్పటికే ఆదేశాలు ఇచ్చారని తెలిపారు. ఈ క్రమంలో బీఆర్ఎస్ ధర్నాలు చేయడం రాజకీయం తప్ప మరోటి కాదని తెలిపారు. కేసీఆర్ రాష్ట్రాన్ని అప్పుల కుప్పలుగా మార్చిన సీఎం రేవంత్ సమర్థవంతంగా పాలన సాగిస్తున్నారని పేర్కొన్నారు. కేసీఆర్ లాగా రైతుల విషయంలో మోసం చేసే సర్కార్ తమది కాదని తెలిపారు. గత 10 ఏండ్లలో రైతులకు ఏం చేశారని, ధర్నాల పేరుతో రైతులను మరోసారి మోసం చేసే పనిలో పడ్డారని పేర్కొన్నారు.

ఎప్పటికప్పుడు ధాన్యం వివరాలు నమోదు చేయాలి

నవతెలంగాణ-నిర్మల్

ధాన్యం కొనుగోలు చేసిన వెంటనే సంబంధించిన వివరాలను ట్యాబ్‌లో ఎంట్రీ చేయాలని అదనపు కలెక్టర్ కిషోర్ కుమార్ నిర్వాహకులను ఆదేశించారు. శనివారం సాయంత్రం కలెక్టరేట్ సమావేశ మందిరంలో వరి ధాన్యం కొనుగోలుకు సంబంధించిన వివిధ అంశాలపై రెవెన్యూ, పౌరసరఫరాల శాఖల అధికారులు, కొనుగోలు కేంద్రాల నిర్వాహకులతో ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ వరి ధాన్యం కొనుగోలు ప్రక్రియను నిర్ణిత గడువులోగా పూర్తి చేయాలని ఆదేశించారు. ధాన్యాన్ని కొనుగోలు చేసిన వెంటనే సకాలంలో మిల్లులకు తరలించాలని, కొనుగోలు వివరాలను ఖచ్చితంగా ట్యాబ్ ఎంట్రీ చేయాలని సూచించారు. మండలాల వారీగా వరి ధాన్యం కొనుగోలు వివరాలు, రైతుల సంఖ్య, మిల్లులకు తరలించిన లారీల వివరాలు, ట్యాబ్ ఎంట్రీ చేసిన సంఖ్య, పెండింగ్ ట్యాబ్ ఎంట్రీ వివరాలు, ధాన్యం కొనుగోలు చేసిన రెండు రోజుల్లోనే రైతుల ఖాతాల్లో డబ్బులు జామచేసే విధంగా చర్యలు తీసుకోవాలని అన్నారు. రైతులకు డబ్బులు జమచేసేందుకు అవసరమైన డాక్యుమెంట్లు తీసుకోవాలని ఆదేశించారు. ఈ సమావేశంలో డీఆర్డీఓ విజయలక్ష్మి, డీఎం సివిల్ సప్లయిస్ శ్రీకళ, డీసీఓ నర్సయ్య పాల్గొన్నారు.



పేకాటాడుతున్న ఏడుగురి అరెస్ట్

నవతెలంగాణ-సారంగాపూర్



మండలంలోని బీరవెల్లి గ్రామ శివారులో శనివారం పేకాటాడుతున్న 7 గురు వ్యక్తులను అరెస్టు చేసినట్టు ఎస్సై చంద్రమోహన్ తెలిపారు. మెడ దయాకర్, కులం గణేష్, సయీద్ బాబు, షైక్ రసూల్, తాండ్ర సాయన్న, తురనం శంకర్, బొడ్డు మహేందర్ వీరందరూ బీరవెల్లికి చెందిన వారు వీరందరూ పేకాటాడుతుండా పట్టుకుని వారి వద్ద ఉన్న రూ. 31వేలు స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసినట్టు ఎస్సై తెలిపారు. ఈ దాడిలో కానిస్టేబుల్ మనోజ్, లింగురాం, రాజాగౌడ్, వినోద్, మాధవ్, హోంగార్డ్ నవీన్ ఉన్నారు.

ప్రమాదవశాత్తు జారి పడి వ్యక్తి దుర్మరణం

నవతెలంగాణ-లక్ష్మణచాంద

మండలంలోని వడ్డేపల్లి గ్రామానికి చెందిన పల్లపు బక్కోళ్ల చిన్న రాజన్న(52) శనివారం ప్రమాదవశాత్తు కాలుజారి పడి దుర్మరణం చెందాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. రాచాపూర్ శివారులోని మాటు కాలువ దగ్గర కాలకృత్యాలకు వెళ్లి, తిరిగి వస్తుండగా ప్రమాదవశాత్తు కాలువ ఒడ్డుపై నుంచి జారి బోర్లా బొక్కల కిందపడటంతో ముక్కులో నుంచి రక్తం వచ్చి అక్కడిక్కడే చనిపోయాడు. మృతుడికి ఇద్దరు కొడుకులు, ఒక కూతురు ఉన్నట్టు ఎస్సై శ్రీకాంత్ తెలిపారు.

రాజీవ్ స్వగృహ స్థలం ఆక్రమణపై ఆర్డీఓ విచారణ

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

మావలలోని రాజీవ్ స్వగృహ లేఅవుట్‌లో గల పార్క్ స్థలం ఆక్రమించి రోడ్లు వేస్తున్న విషయాన్ని ప్లాట్ల కొనుగోలుదారులు శుక్రవారం కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. మౌలిక వసతుల సౌకర్యాల పనులపై లబ్ధిదారులు కలెక్టర్‌కు విన్నవించారు. స్పందించిన కలెక్టర్ విచారణ చేపట్టాల్సిందిగా ఆర్డీఓ వినోద్ కుమార్‌ను ఆదేశించారు. ఈ మేరకు శనివారం లేఅవుట్ స్థలాన్ని ఆర్డీఓ, మున్సిపల్ కమిషనర్ ఖమర్ అహ్మద్‌తో కలిసి పరిశీలించారు.

చెరువుకు మరమ్మతులు చేపట్టాలి

- కజ్జర్ల గ్రామ రైతుల వినతి



నవతెలంగాణ-తలమడుగు

మండలంలోని కజ్జర్ల గ్రామ చెరువు కుడి, ఎడమ కాలువల తూము పనులకు మరమ్మతులు చేపట్టాలని గ్రామస్తులు రిటైర్డ్ మున్సిపల్ కమిషనర్ చింతలపల్లి దేవారెడ్డి ఆధ్వర్యంలో శనివారం జిల్లా కలెక్టర్‌తో పాటు నీటిపారుదల శాఖ చీఫ్ ఇంజనీర్ శ్రీనివాస్‌కు వినతిపత్రం అందజేశారు. చెరువు తూములు పూర్తిగా ధ్వంసం కావడంతో అత్యవసర పనుల కింద చెరువు మరమ్మత్తులు పనులను చేపట్టాలన్నారు. వర్ష కాలాన్ని దృష్టిలో ఉంచుకొని మరమ్మతులు చేపట్టాలని కోరారు. లేనిపక్షంలో చెరువు కట్ట తెగి చెరువు కింద గ్రామాలైన హస్నాపూర్, ఖోడద్ గ్రామాలకు ప్రమాదం పొంచి ఉందని పేర్కొన్నారు. కలెక్టర్‌తో పాటు ఆ శాఖ చీఫ్ ఇంజనీర్ స్పందించి వారం రోజుల్లో పనులు పూర్తి చేసే విధంగా కిందిస్థాయి ఉద్యోగులను ఆదేశించినట్టు తెలిపారు. అదేవిధంగా మండల జెడ్పీటీసీ గోక గణేష్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లినట్టు తెలిపారు. జిల్లా అధికారులను కలిసిన వారిలో కిరణ్ కుమార్, చింతలపెల్లి రామన్న, కేశవరెడ్డి, శివారెడ్డి, గ్రామస్తులు, రైతులు ఉన్నారు.

భ్రూణహత్యల కట్టడికి అవగాహన కల్పించాలి



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

భ్రూణహత్యల కట్టడికి విస్తృత ప్రచారం, అవగాహన కల్పించాలని డిప్యూటీ డీఎంహెచ్ఓ డా.సాధన సూచించారు. శనివారం డీఎంహెచ్ఓ కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పీసీపీఎండీటీ చట్టం-1994పై గ్రామాల్లో అవగాహన కల్పించాలన్నారు. ప్రస్తుతం లింగ నిష్పత్తిలో ఆడపిల్లల సంఖ్య తగ్గిపోతున్నదని, ఎవరైనా అబార్షన్లు చేస్తున్నారా, ఆస్పత్రుల్లో లింగ నిర్ధారణ పరీక్షలు ఏమైనా చేస్తున్నారా..? అనే అంశాలపై ప్రధానంగా దృష్టి సారించాలన్నారు. ఈ సమావేశంలో వైద్యులున్నారు.

ఎరువులు, విత్తనాలు సకాలంలో అందిస్తాం

నవతెలంగాణ-బెజ్జూర్

రైతులకు ఎరువులు విత్తనాలు సకాలంలో అందిస్తానని జిల్లా ఇన్‌చార్జి డీసీఓ బి.మోహన్ అన్నారు. మండల కేంద్రంలోని ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘం కార్యాలయాన్ని ఆయన



ఆకస్మికంగా తనిఖీ చేశారు. అనంతరం సహకార సంఘం రిజిస్టర్లను తనిఖీలు చేశారు. సహకార సంఘం లావాదేవీలు ఈ నెల 31లోగా ఆన్‌లైన్లఓ నమోదు చేయాలని సీఈఓ, సిబ్బందిని ఆదేశించారు. రైతుల వివరాలు నమోదైన తర్వాత సిబ్బంది జీతభత్యాలు అందజేస్తామన్నారు. ఆయన వెంట ఆదిలాబాద్ ఏజీఎం శ్రీనివాసులు, సూపరింటెండెంట్ వెంకటరమణ, సీనియర్ ఆడిటర్ రాజేందర్, కంప్యూటర్ ఆపరేటర్ విజయ్, సహకార సంఘం చైర్మన్ ఓం ప్రకాష్, సీఈఓ సంజీవ్, సిబ్బంది వెంకటేశ్వర్ గౌడ్, సత్యనారాయణ గౌడ్ పాల్గొన్నారు.

రేపటి నుంచి జూన్ 2 వరకు టెట్

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

ఈ నెల 20 నుంచి వచ్చే నెల జూన్ 2 వరకు రెండు విడతల వారీగా టెట్ పరీక్ష ఉంటుందని, అభ్యర్థులు ఈ విషయాన్ని గమనించాలని ఆదిలాబాద్ డీఈఓ ప్రణీత శనివారం ప్రక్రటనలో పేర్కొన్నారు. ఉదయం 9 నుంచి 11.30 గంటలు, మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 4.30 గంటల వరకు పరీక్ష ఉంటుందని తెలిపారు. మావలలోని నలంద కళాశాలలో పరీక్ష కేంద్రం ఏర్పాటు చేశామని, 1591 మంది అభ్యర్థులు పరీక్ష రాయనున్నారని పేర్కొన్నారు.

త్రిబుల్ తలాక్ చెప్పిన వ్యక్తిపై కేసు నమోదు

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

త్రిబుల్ తలాక్ చెప్పిన వ్యక్తిపై కేసు నమోదు చేసినట్టు మహిళా పోలీస్ స్టేషన్ ఇన్స్‌పెక్టర్ జి.శ్రీనివాస్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఆయన వివరాల మేరకు ఆదిలాబాద్ పట్టణంలోని కేఆర్‌కే కాలనీకి చెందిన జాస్మిన్(28) అనే మహిళ 2017 సంవత్సరంలో అబ్దుల్ అతీక్‌తో వివాహం జరిగింది. వీరి ఇరువురికి ఇద్దరు ఆడపిల్లలు సంతానం. గత 2 సంవత్సరాలుగా భార్యాభర్తల మధ్యన మనస్పర్థాల కారణంగా తరచూ గొడవలు జరుగుతూ ఉండేవి. గత సంవత్సరం ఫిబ్రవరి నెలలో భర్త అబ్దుల్ అతీక్‌పై వరకట్నం వేధింపుల కేసు కూడా నమోదు చేయడం జరిగిందని తెలిపారు. శనివారం బాధితురాలి ఫిర్యాదు మేరకు భర్త అబ్దుల్ అతీక్‌పై త్రిబుల్ తలాక్ కేసు నమోదు చేయడం జరిగిందని తెలిపారు.

ఘనంగా వాసవీ మాతా జయంతి

నవతెలంగాణ-బెజ్జూర్

మండల కేంద్రంలో ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో శనివారం వాసవి మాత జయంతి ఉత్సవాలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా వాసవి మాతకు ఆర్యవైశ్య సంఘం సభ్యులు అభిషేకం, పూజలు చేశారు. అనంతరం అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం మండల అధ్యక్షులు రాచకొండ శ్రీవర్ధన్, సభ్యులు రాచకొండ చంద్రశేఖర్, పుల్లూరు సతీష్, నేరెళ్ల సంతోష్, వెంకటరమణ, భోగ రమేష్, కిరణ్, మహేష్, నీలేష్, శంకరయ్య, మహిళలు పాల్గొన్నారు.

రాయితీ బియ్యం పట్టివేత

నవతెలంగాణ-వాంకిడి



అక్రమంగా వాహనంలో తరలిస్తున్న పీడీఎస్ బియ్యాన్ని ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు పట్టుకున్నారు. శనివారం విశ్వసనీయ సమాచారం మేరకు ఐచర్(టీఎస్02యూఏ1517) వాహనంలో తరలిస్తుండగా మండలంలోని సరండి టోల్ ప్లాజా వద్ద పట్టుకున్నారు. వంద క్వింటాళ్ల బియ్యాన్ని మహారాష్ట్రకు తరలిస్తుండగా పట్టుకున్నామని డీటీ జి.రాజ్‌కుమార్ తెలిపారు. బియ్యాన్ని సీజ్ చేసి నిందితులపై 6ఏ కేసు నమోదు చేసి పై అధికారులకు నివేధించినట్టు పేర్కొన్నారు. బియ్యాన్ని ఆసిఫాబాద్ ఎంఎల్ఎస్ పాయింట్‌కు అప్పగించామని, పట్టుబడిన వాహనాన్ని పోలీసు స్టేషన్‌లో సీజ్ చేసి పెట్టామని తెలిపారు. అక్రమంగా బియ్యాన్ని రవాణ చేసే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

శారీరక, మానసిక ధృఢత్వానికే యోగా

నవతెలంగాణ-రెబ్బెన



శారీరక, మానసిక ధృఢత్వానికే యోగ ఉపయోడపగుతుందని యోగ శిక్షకురాలు కేసరి అలేఖ్య అన్నారు. గోలేటి సింగరేణి పాఠశాల ఆవరణలో యువజన క్రీడా శాఖ ఆధ్వర్యంలో ఉచిత సమ్మర్ యోగా క్యాంప్‌ను నిర్వహించారు. ఇది ఈనెల 31 వరకు కొనసాగుతుంది. విద్యార్థులు సెలవులను వృథా చేసుకోకుండా శారీరక, మానసిక ధృఢత్వానికి యోగ నేర్చుకోవాలని ఆమె సూచించారు. ఇందులో స్పోర్ట్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు కేసరి అంజనేయులు గౌడ్, జనరల్ సెక్రెటరీ కొలిపాక కిరణ్, ఉపాధ్యక్షులు భాస్కర్, కోశాధికారి జగన్నాథ ఓదెలు ఉన్నారు.

ఎస్పీఎం వైద్య సేవలు సద్వినియోగం చేసుకోవాలి



నవతెలంగాణ-కాగజ్‌నగర్ రూరల్

సిర్పూర్ పేపర్ మిల్లు(ఎస్పీఎం), స్పర్శ ఫౌండేషన్ ఆధ్వర్యంలో మారుమూల గ్రామాల్లో ఉచిత వైద్యశిబిరాలు నిర్వహించడం జరుగుతుందని, గ్రామస్తులు వీటిని సద్వినియోగం చేసుకోవాలని ఎస్పీఎం చీఫ్ మేనేజర్ రమేష్ రావు తెలిపారు. మండలంలోని కొత్తసార్సాలలో శనివారం ఎస్పీఎం, స్పర్శ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. వైద్యశిబిరానికి కొత్తసార్సాల, పాతసార్సాల, గెర్రెగూడ గ్రామాల ప్రజలు తరలివచ్చారు. ఈ సందర్భంగా 700 మందికి ఆరోగ్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేసినట్టు డాక్టర్ భానుప్రకాష్ తెలిపారు. స్పర్శ ఫౌండేషన్ మేనేజర్ రీణ బివాల్, ఎస్పీఎం ప్రతినిధుల తుమ్మ రమేష్, నాగేశ్వర్‌రావు, శివకుమార్, యువకులు పుల్ల అశోక్, పుల్ల శ్రీకాంత్, మహేష్, సురేందర్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

ప్రజా సమస్యల గొంతుక మీడియా

- ఎమ్మెల్యే కోవ లక్ష్మి
- ప్రింట్ మీడియా ప్రెస్ క్లబ్ ప్రారంభోత్సవం



నవతెలంగాణ-ఆసిఫాబాద్

ప్రజా సమస్యలు ఎలుగెత్తి చాటడంలో ఒక గొంతుకల మీడియా పని చేస్తుందని ఎమ్మెల్యే కోవ లక్ష్మి అన్నారు. జిల్లా కేంద్రంలోని ఆర్టీసీ కాంప్లెక్స్‌లో ఆసిఫాబాద్ మండల ప్రెస్ క్లబ్ ప్రారంభోత్సవ కార్యక్రమానికి జడ్పీ చైర్మన్ కోనేరు కృష్ణ, సిర్పూర్ ఎమ్మెల్యే పాల్వాయి హరీష్ బాబు, డీసీసీ అధ్యక్షుడు విశ్వ ప్రసాద్, జడ్పీటీసీ నాగేశ్వరరావు, ఎంపీపీ మల్లికార్జున్, నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జి శ్యాం నాయక్, బీసీ సంఘం జిల్లా అధ్యక్షుడు రూప్నర్ రమేష్‌తో కలిసి ముఖ్యఅతిథిగా హాజరై రిబ్బన్ కట్ చేశారు. అనంతరం ఆసిఫాబాద్ ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు చిప్ప సురేష్, ప్రధాన కార్యదర్శి కృష్ణంరాజు, కోశాధికారి శ్రీధర్‌లను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రజలకు ప్రభుత్వానికి మధ్య వారధిగా మీడియా పని చేస్తుందన్నారు. ప్రజల గొంతుకలను ఎప్పటికప్పుడు సమాజానికి తెలియజేసే గొప్ప శక్తి మీడియా వద్ద ఉందన్నారు. జిల్లా కేంద్రంలో పనిచేసే వారికి జర్నలిస్టులకు ఇండ్ల స్థలాల కోసం గతంలో హామీ ఇచ్చామని దానిని ఎన్నికల కోడ్ తర్వాత నెరవేర్చే విధంగా ప్రయత్నం చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ బాలేష్ గౌడ్, జిన్నింగ్ మిల్ అసోసియేషన్ అధ్యక్ష,ప్రధాన కార్యదర్శులు అశోక్, రఫీక్, బీసీ రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు మారుతి, ఎలక్ట్రానిక్ మీడియా అధ్యక్ష, కార్యదర్శులు రాజు, ఖలీల్, నాయకులు, మీడియా ప్రతినిధులు పాల్గొన్నారు.

రాయితీ జీలుగా విత్తనాలు సద్వినియోగం చేసుకోండి



నవతెలంగాణ-కాగజ్‌నగర్ రూరల్

ప్రభుత్వం రాయితీపై అందజేస్తున్న జీలుగా విత్తనాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని మండల వ్యవసాయ శాఖ అధికారి (ఏఓ) రామకృష్ణ తెలిపారు. ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ఆధ్వర్యంలో శనివారం ఏఓ రైతులకు రాయితీపై జీలుగా విత్తనాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఏఓ మాట్లాడుతూ జీలుగా విత్తనాలు క్వింటాలు రూ.9,200 ఉండగా రాయితీపై రూ.3720కే అందజేస్తున్నట్లు తెలిపారు. పొలాల్లో జీలుగా విత్తనాలు వినియోగించడం వల్ల భూమిని సారవంతంగా మార్చి పంటల్లో అధిక దిగుబడులు సాధించవచ్చని సూచించారు. ఈ విత్తనాలు కావాల్సిన రైతులు పీఏసీఎస్‌లో పొందవచ్చని, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఇందులో సీఈఓలు ముక్త్యార్, సతీష్, రైతులు పాల్గొన్నారు.

శిక్షణ శిబిరానికి చెస్ బోర్డ్స్ అందజేత

నవతెలంగాణ-రెబ్బెన

గిరిజన సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వేసవి క్రీడ శిక్షణ శిబిరానికి తిర్యాని మండలంలోని చింతపల్లి గ్రామానికి చెందిన మేంద్రపు రవీందర్ చెస్ బోర్డులు అందజేశారు. ఈ సందర్భంగా ఐటీడీఏ పీఓ ఖుష్బు గుప్తా రవీందర్‌ను అభినందించి సన్మానించారు. అనంతరం రవీందర్ మాట్లాడుతూ తను ఒక గిరిజన ఆశ్రమ పాఠశాలలో చదువుకున్నానని, ప్రస్తుతం సీఆర్‌టీ పీడీగా విధులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. తన వంతుగా తమ గిరిజన విద్యార్థులను క్రీడల్లో ప్రోత్సహించాలనే ఉద్దేశ్యంతో తన గురువు గిరిజన క్రీడల అధికారి బండ మీనారెడ్డి సూచన మేరకు చెస్ బోర్డులు అందజేయడం జరిగినదన్నారు. కార్యక్రమంలో ట్రైబల్ వెల్ఫేర్ డిప్యూటీ డైరెక్టర్ రమాదేవి, ఏటీడీఓలు క్షేత్రయ్య, పురుషోత్తం, ఖమర్ హుస్సేన్, ఏసీఎంఓ ఉద్ధవ్, జీసీడీఓ శకుంతల, ఆసిఫాబాద్, మంచిర్యాల గిరిజన క్రీడాల అధికారులు బండ మీనా రెడ్డి, బండ జీవరత్నం, క్రీడా పాఠశాల హెచ్ఎం ఎన్ కృష్ణారావు, హెచ్‌డబ్ల్యూఓ శ్రీనివాస్, విజయశాంతి, కోచ్లు విద్యాసాగర్ అరవింద్, తిరుమల్, పీఈటీలు గుండం లక్ష్మణ్, పెందూరు మంగవతి, శ్రీనివాస్, సుభాష్, సుమలత, బాక్సింగ్ సెక్రెటరీ శేఖర్ పాల్గొన్నారు.

గరంగరంగా చివరి జడ్పీ సమావేశం

- అధికారుల తీరుపై సభ్యుల అసహనం
- 11 శాఖలపై సమగ్ర చర్చ

నవతెలంగాణ-ఆసిఫాబాద్



సమావేశంలో జడ్పీ చైర్మెన్ కోనేరు కృష్ణ, కలెక్టర్ వెంకటేశ్ ధోత్రే, అదనపు కలెక్టర్ దీపక్

స్థానిక సంస్థల పదవీకాలం పూర్తి అవుతున్న సందర్భంగా జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్‌లో కలెక్టర్ వెంకటేష్ ధోత్రే ఆధ్వర్యంలో జడ్పీ చైర్మన్ కోనేరు కృష్ణ అధ్యక్షతన నిర్వహించిన సర్వసభ్య సమావేశం అధ్యంతం గరంగరంగా సాగింది. జిల్లాలోని వివిధ శాఖల్లో అభివృద్ధి అనుకున్న స్థాయిలో సాగకపోవడంపై ప్రజాప్రతినిధులు ఆగ్రహం వ్యక్తం చేశారు. 44 శాఖలకు గాను 11 శాఖలపై సమగ్ర చర్చ కొనసాగింది. రహదారులు భవనాల శాఖ, పంచాయతీరాజ్, ఐటీడీఏ శాఖల చర్చలో భాగంగా ఎమ్మెల్యే హరీష్ బాబు మాట్లాడుతూ తన నియోజకవర్గంలో 8 రోడ్లను ఒకే కాంట్రాక్టర్‌కు ఇవ్వడమేంటని ప్రశ్నించారు. అభివృద్ధి పనులు జరగకపోవడంతో ప్రజలు ప్రశ్నిస్తున్నారని మండిపడ్డారు. ఎమ్మెల్యే కోవ లక్ష్మి మాట్లాడుతూ గుండి బ్రిడ్జికి రూ.కోటి ఇస్తే పూర్తి అయ్యేదని ఇటీవల జిల్లా ఇన్‌చార్జి మంత్రి బ్రిడ్జిని పరిశీలించినప్పటికీ నిధులు ఇవ్వకపోవడం అభివృద్ధిపై వారికి ఉన్న చిత్తశుద్ధి అర్థమవుతుందన్నారు. తిర్యాని జడ్పీటీసీ చంద్రశేఖర్ మాట్లాడుతూ మండలంలో తన హయాంలో రోడ్లు కాలేదని ప్రతి జిల్లా పరిషత్ మీటింగ్‌లో అరవడం మినహా చేసిందేమీ లేదన్నారు. మంగి గుండాల రహదారికి మరమ్మత్తులు చేయాలని, గోవేనకు విద్యుత్ సౌకర్యం కల్పించాలని కోరారు. సిర్పూర్(టి) ఎంపీపీ సత్యం మాట్లాడుతూ రైల్వే స్టేషన్ రోడ్డు మరమ్మత్తులు చేయాలన్నారు. ఆసిఫాబాద్ జడ్పీటీసీ అరిగెల నాగేశ్వరరావు మాట్లాడుతూ జిల్లా కేంద్రంలోని సాయిబాబా ఆలయం నుండి గుండి బైపాస్ రహదారి వరకు రోడ్డు నిర్మించాలని, ఇది కాకుండా చేతకాని సమాధానాలు చెప్పకూడదన్నారు. వ్యవసాయ, మార్క్‌ఫెడ్, మార్కెటింగ్, సివిల్ సప్లయి శాఖల సమీక్షలో మాట్లాడుతూ వరి ధాన్యం కొనుగోలు చేయాలని సభ్యులు డిమాండ్ చేశారు. వాంకిడి మండలం నుండి పత్తి గింజలు మహారాష్ట్రకు తరలివెళ్తున్నాయని అక్కడ ధర ఎక్కువగా ఉండడమే కారణమని దీనితో మండల రైతులకు అక్కడి ఫెర్టిలైజర్ డీలర్లు పత్తి గింజలు అమ్మడం లేదని వాంకిడి జడ్పీటీసీ అజయ్ కుమార్ అన్నారు. ఆసిఫాబాద్ ఎంపీపీ మల్లికార్జున్ మాట్లాడుతూ మండలంలో అప్పపెల్లి, ఈదులవాడలలో వరి కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలన్నారు. అటవీ శాఖ సమీక్షలో సభ్యులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. రోడ్లకు అటవీ అనుమతులు ఇవ్వకపోవడం, పోడు భూముల విషయాలతో పాటు జిల్లా అటవీశాఖ అధికారి సమావేశానికి రాకపోవడంపై సభ్యులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. సభ ఒక్కసారిగా వేడెక్కింది. ఏదిఏమైనా స్థానిక సంస్థల సభ్యుల చివరి సర్వసభ్య సమావేశం అధికార పార్టీ నుండి గెలిచిన సభ్యులు లేకపోవడం బీఆర్ఎస్‌కు చెందిన జడ్పీ చైర్మన్, రెబ్బెన జడ్పీటీసీలు మాత్రమే అధికార పార్టీ వైపు ఉండడంతో ప్రతిపక్ష పార్టీల నాయకులు విరుచుకపడ్డారు. సర్వసభ్య సమావేశంలో మొదటిసారి ఇంత పెద్ద రగడ సాగింది. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ దీపక్ తివారి, జిల్లా పరిషత్ సీఈఓ అనిల్ కుమార్, జిల్లాలోని ఆయా శాఖల జిల్లా అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

సభ్యులు చెప్పిన సమస్యలు పరిష్కరిస్తాం

కలెక్టర్ వెంకటేష్ ధోత్రే



వివిధ శాఖల పనితీరు, సమస్యలపై సభ్యులు లేవనెత్తిన సమస్యల పరిష్కారం కోసం అధికారులతో సమన్వయం చేయిస్తూ పూర్తి చేస్తాం. ఇదే సందర్భంలో అధికారులు కూడా సభ్యులకు స్పందించే విధంగా చర్యలు తీసుకుంటాం. నియామక ప్రక్రియలో స్థానికులకు అవకాశం కలిగే విధంగా చూస్తాం. రోడ్ల విషయంలో అధికారులు కాంట్రాక్టర్‌లతో సమావేశం నిర్వహించేలా చర్యలు తీసుకుంటాం.

పోడు భూముల అభివృద్ధికి సహకరించాలి

కోనేరు కృష్ణ, జడ్పీ చైర్మన్



గత ప్రభుత్వం పోడు భూములకు ఇచ్చిన పట్టాలో ప్రస్తుతం బోర్‌వెల్ లేదా ఇతర అభివృద్ధి పనులు చేసుకోవడానికి అటవీ అధికారులు అడ్డు తగలడం సరైనది కాదు. పోడు భూముల అభివృద్ధి పనులకు సహకరించాలి. లేదంటే రైతులతో కలిసి ఆందోళన చేయాల్సి ఉంటుంది.

జిల్లా కేంద్రంలో భూముల కబ్జా అరికట్టాలి

కోవలక్ష్మి, ఆసిఫాబాద్ ఎమ్మెల్యే



జిల్లా ఆవిర్భావం తర్వాత అభివృద్ధిని ఆసరాగా చేసుకుని కొంతమంది దళారులు ప్రభుత్వ భూములు జిల్లా కేంద్రంలో కబ్జా చేస్తున్నారని అధికారులు నిమ్మకు నీరెత్తినట్లు చూస్తున్నారు. కబ్జాదారుల పేరుతో సహా తన లెటర్ ప్యాడ్ ద్వారా అందిస్తానని వారిపై చర్యలు తీసుకొని భూములు కాపాడాలి. జిల్లాలో ఇసుక మాఫియా పెరిగిపోయిందని, ఇటుక బట్టీల నిర్వహణ పేరున ఇసుక అక్రమ రవాణా చేస్తున్నారన్నారు. చెన్నూర్ నుండి ఆదిలాబాద్ వెళ్లే లారీలు ఆసిఫాబాద్ ఎందుకు వస్తున్నాయని అధికారులతో కుమ్మక్కై దళారులు స్థానికంగా ఉన్న ఇసుకను చెన్నూర్ నుండి వస్తున్నట్లు పేపర్లు సృష్టించి తీసుకువెళ్తున్నారు. వాటిని అరికట్టాలి. ఆసిఫాబాద్ మండలంలోని వావుదాం పాఠశాలకు భవనం నిర్మించాలి. అది ప్రస్తుతం రైతు వేదికలో కొనసాగుతుంది.

ఆస్పత్రిలో అక్రమదందా

అరిగెల నాగేశ్వరరావు, ఆసిఫాబాద్ జడ్పీటీసీ



జిల్లా ఆస్పత్రి కేవలం రెఫరల్ ఆస్పత్రిగా మారింది. అంబులెన్స్ వాహనాల యజమానులతో కలిసి కమిషన్ల పేరిట వైద్యులు అక్రమ దంద కొనసాగిస్తున్నారు. జిల్లాలోని వివిధ శాఖల్లో అవుట్ సోర్సింగ్ ఏజెన్సీ ద్వారా చేస్తున్న నియామకాలు స్థానికులకు అవకాశం ఇవ్వకుండా, భర్తీ ప్రక్రియ స్థానికంగా ఉన్న ఏజెన్సీలకు అప్పగించాలి..

అధికారులతో కాంట్రాక్టర్లు కుమ్మక్కు

పాల్వాయి హరీష్ బాబు, సిర్పూర్ ఎమ్మెల్యే



జిల్లాలో అధికారులు కాంట్రాక్టర్లతో కుమ్మక్కై రోడ్లు కానివ్వడం లేదని, రైస్ మిల్లర్లతో కలిసి పంట కొనడం లేదని, నిరుద్యోగ యువతకు అవుట్ సోర్సింగ్ ఏజెన్సీలతో కొమ్ముకై ఉద్యోగాలు ఇవ్వడం లేదని మూడు మాఫియాలు జిల్లాలో కొనసాగుతున్నాయి. మెడికల్ కళాశాల అభివృద్ధిపై దృష్టి సారించాలి. తన నియోజకవర్గంలోని రహదారులకు అటవీ అనుమతులు వచ్చేలా చూడాలి. వర్షాకాలం ప్రారంభమవుతున్న నేపథ్యంలో జిల్లాలో 48 వేల మెట్రిక్ టన్నులు వరి పండితే ఇప్పటివరకు 2000 మెట్రిక్ టన్నులు కొనుగోలు చేశారన్నారు. తప్పతాలు పేరుతో వరి కొనుగోలులో కటింగ్ చేస్తే కలెక్టరేట్ ముట్టడి చేస్తామని హెచ్చరించారు.

రైతులకు ఇబ్బంది కలగకుండా చూడాలి

అరిగెల మల్లికార్జున్, ఆసిఫాబాద్ ఎంపీపీ



ప్రస్తుతం రబీ పంట కొనుగోలు విషయంలో రైతులకు ఇబ్బంది కలగకుండా చూడాలి. ఖరీఫ్ సీజన్ కు సంబంధించి ఎరువులు, పత్తి గింజలు అందుబాటులో ఉంచాలి. యూరియా, డీఏపీ లాంటివి నేరుగా రైతులకు సరఫరా చేయాలి. జిల్లాలో 37 వరి కొనుగోలు కేంద్రాలకు ఇప్పటివరకు 18 మాత్రమే ప్రారంభమయ్యాయి. మిగతా వాటిని వెంటనే ప్రారంభించాలి. అభివృద్ధి పనులు కూడా మండలంలో చేపట్టి పూర్తి చేసేలా అధికారులు చూడాలి.

వేసవి క్రీడా శిబిరం సద్వినియోగం చేసుకోవాలి

- ఐటీడీఏ పీఓ ఖుష్బు గుప్తా
- క్రీడాకారులకు దుస్తుల అందజేత



క్రీడ దుస్తులను అందిస్తున్న ఐటీడీఏ పీఓ ఖుష్బు గుప్తా

నవతెలంగాణ-ఆసిఫాబాద్

వేసవి క్రీడ శిబిరాలను గిరిజన క్రీడ విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని ఉట్నూర్ ఐటీడీఏ పీఓ కుష్బు గుప్తా అన్నారు. జిల్లా కేంద్రంలోని గిరిజన క్రీడా పాఠశాల మైదానంలో మంచిర్యాల, ఆసిఫాబాద్ జిల్లాలకు సంబంధించి ప్రారంభమైన క్రీడా శిబిరాన్ని ఆమె శనివారం సందర్శించారు. శిక్షణ పొందుతున్న క్రీడాకారులకు దుస్తులు, షూలను అందజేశారు. ఈ సందర్భంగా పీఓ మాట్లాడుతూ రెండు జిల్లాల్లోని 60 మంది బాలికలు, 60 మంది బాలురలకు 15 రోజులపాటు ఆరు క్రీడా అంశాల్లో ఇచ్చే శిక్షణను సద్వినియోగం చేసుకోవాలన్నారు. గిరిజన విద్యార్థుల్లో క్రీడా నైపుణ్యాలు పెంచే ఉద్దేశంతో ప్రత్యేక వేసవి శిబిరాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. 15 రోజుల పాటు విద్యార్థులకు నాణ్యమైన శిక్షణ అందించాలని సూచించారు. విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో కూడా రాణించాలన్నారు. కార్యక్రమంలో డీటీడీఓ రమాదేవి, జిల్లా గిరిజన క్రీడల అధికారి బండమీనారెడ్డి, ట్రైబల్ వెల్ఫేర్ డిప్యూటీ ఈఈ నిరంజన్, ఏసీఎంఓ ఉద్ధవ్, ఏటీడీఓలు క్షేత్రయ్య, పురుషోత్తం, కమర్ హుస్సేన్, మంచిర్యాల క్రీడల అధికారి జీవరత్నం, క్రీడా పాఠశాల హెచ్ఎం ఎన్. కృష్ణారావు, హెచ్‌డబ్ల్యూఓ శ్రీనివాస్, విజయశాంతి, కోచులు విద్యాసాగర్, అరవింద్, తిరుమల్, పీఈటీలు లక్ష్మణ్, మంగవతి, శ్రీనివాస్, సుభాష్, రవీందర్, సుమలత, బాక్సింగ్ సెక్రెటరీ శేఖర్ పాల్గొన్నారు.

గ్రూప్-1 ప్రిలిమినరీ పరీక్ష పకడ్బందీగా నిర్వహించాలి

- టీఎస్‌పీఎస్సీ చైర్మన్ మహేందర్ రెడ్డి

నవతెలంగాణ-ఆసిఫాబాద్



జూన్ 9న జరుగబోయే గ్రూప్-1 ప్రిలిమినరీ పరీక్ష ఏర్పాట్లు పకడ్బందీగా నిర్వహించాలని టీఎస్‌పీఎస్సీ చైర్మన్ మహేందర్ రెడ్డి కలెక్టర్లకు సూచించారు. గ్రూప్-1 ప్రిలిమినరీ పరీక్ష నేపథ్యంలో హైదరాబాద్ నుండి జిల్లాల కలెక్టర్లు, అడిషనల్ కలెక్టర్లు, ఎస్పీలతో టీఎస్పీఎస్సీ చైర్మన్ అధికారులతో కలిసి వీడియో కాన్ఫిరెన్స్ నిర్వహించారు. జిల్లా కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాలులో అడిషనల్ కలెక్టర్లు దీపక్ తివారీ, దాసరి వేణు, ఎస్పీ సురేష్ కుమార్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా అడిషనల్ కలెక్టర్ దీపక్ తివారీ మాట్లాడుతూ జిల్లాలో వచ్చే నెల జూన్ 9న జరిగే గ్రూప్-1 ప్రిలిమినరీ పరీక్షలకు పకడ్బందీ ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. జిల్లాలో కాగజ్‌నగర్ పట్టణంలో 7, ఆసిఫాబాద్ జిల్లా కేంద్రంలో 6 కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నామన్నారు. జిల్లా వ్యాప్తంగా 2783 మంది అభ్యర్థులు పరీక్ష రాయనున్నట్లు తెలిపారు. కాగజ్‌నగర్‌లో 1512, ఆసిఫాబాద్‌లో 1271 మంది అభ్యర్థులు పరీక్షకు హాజరు కానున్నట్లు పేర్కొన్నారు. పరీక్షా కేంద్రాలల్లో సౌకర్యాలు కల్పిస్తామన్నారు. అభ్యర్థులు పరీక్షా కేంద్రాలకు గంటన్నర ముందే చేరుకునేలా ఆర్టీసీ బస్సులు నడిపేలా ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. పరీక్ష పేపర్లను స్ట్రాంగ్ రూంలో భద్రపరిచి బందోబస్తు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. పరీక్షా కేంద్రానికి మూడు కిలోమీటర్ల పరిధిలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా పోలీసు బందోబస్తు ఉంటుందన్నారు. ఈ వీడియో కాన్ఫిరెన్స్‌లో ఎఎస్పీ ప్రభాకర్ రావు, డీఎస్పీ సదయ్య, గ్రూప్-1 నిర్వహణ ఆసిఫాబాద్ రీజినల్ సమన్వయ కర్త డి. లక్ష్మీనర్సింహం, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

భీం విగ్రహావిష్కరణకు ఎమ్మెల్యేకు ఆహ్వానం



నవతెలంగాణ-ఆసిఫాబాద్

ఈనెల 26న సిర్పూర్ నియోజకవర్గంలోని కౌటాల మండలం తాడ్పల్లి గ్రామంలో నిర్వహించే కుమురం భీం విగ్రహావిష్కరణకు ఆసిఫాబాద్ ఎమ్మెల్యే కోవ లక్ష్మికు నిర్వాహకులు ఆహ్వాన పత్రిక అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆదివాసుల కోసం పోరాటం చేసిన భీం విగ్రహం ప్రతి గ్రామంలో ఉండే విధంగా కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో తిర్యాని ఎంపీపీ మర్సకోల శ్రీదేవి, నిర్వాహకులు మడావి వత్తు, సకారాం, వసంత్, రవి పాల్గొన్నారు.

నర్సరీలో మొక్కల సంరక్షణకు ప్రత్యేక చర్యలు చేపట్టాలి



నవతెలంగాణ-కెరమెరి

నర్సరీలో పెంచుతున్న మొక్కలపై ప్రత్యేక చర్యలు చేపట్టాలని ఎంపీడీఓ కృష్ణారావు అన్నారు. శనివారం మండలంలోని జోడేఘాట్, శివగూడ గ్రామాల్లో చేపడుతున్న ఉపాధి హామీ అభివృద్ధి పనులను పరిశీలించారు. జోడెఘాట్‌లో ఏర్పాటు చేసిన నర్సరీలోని మొక్కలను పరిశీలించారు. అధిక ఉష్ణోగ్రతల కారణంగా మొక్కలు ఎండిపోకుండా ప్రతిరోజు నీరందించాలన్నారు. మొక్కల మధ్య పెరిగే పిచ్చి మొక్కలను ఎప్పటికప్పుడు తొలగించాలన్నారు. అనంతరం శివగూడ గ్రామంలో ఉపాధి హామీ పనుల్లో భాగంగా చేపడుతున్న బావి పనులను పరిశీలించారు. బావి తవ్వుతున్న క్రమంలో పెద్దపెద్ద బండరాళ్లు రావడంతో పనులను నిలిపివేసినట్లు గ్రామస్తులు ఆయన దృష్టికి తీసుకువచ్చారు. ఇప్పటి వరకు చేసిన పనులకు సంబంధించిన కూలీల వేతనాలు చెల్లిస్తామని ఎంపీడీఓ అన్నారు. ప్రతి రోజు ఉపాధి పనులకు హాజరై, పనులను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఆయన వెంట ఏపీఓ మల్లయ్య, పంచాయతీ కార్యదర్శి శ్రావణ్ ఉన్నారు.

భర్తను చంపిన కేసులో భార్య, ప్రియుడు అరెస్ట్

నవతెలంగాణ-ఆసిఫాబాద్

వివాహేతర సంబంధం పెట్టుకొని భర్తను చంపిన కేసులో భార్య, ఆమె ప్రియుడిని అరెస్టు చేసిన సంఘటన మండలంలోని రహపెల్లిలో చోటు చేసుకుంది. ఆసిఫాబాద్ సీఐ సతీష్ తెలిపిన వివరాల ప్రకారం గ్రామానికి చెందిన చునార్కర్ కళావతితో చునార్కర్ రవీందర్‌కు 16 సంవత్సరాల క్రితం వివాహం జరిగింది. వీరికి ఇద్దరు కుమారులున్నారు. అక్కపెల్లి రవీందర్‌తో సంవత్సర కాలంగా అక్రమ సంబంధం పెట్టుకుంది. ఇదే విషయం భర్తకు తెలియడంతో ఆమెను పుట్టింటికి పంపించేశారు. అయితే పెద్దమనుషుల సూచన మేరకు తిరిగి కాపురానికి తీసుకువచ్చాడు. ఇదే క్రమంలో ఈనెల 16న అర్ధరాత్రి అందరూ పడుకున్న సమయంలో అక్కపెల్లి రవీందర్‌ను తన ఇంటికి రమ్మని కళావతి ఫోన్ చేసింది. వెనకాల రూంలో శబ్దం రావడంతో సునార్కర్ రవీందర్ నిద్రలేచి వెనకాల రూంలోకి వెళ్లి ఇద్దరు కలిసి ఉండటం చూశాడు. తాను ఇక బతకనని పక్కనే ఉన్న పురుగుల మందు తాగి అపస్మారక స్థితిలోకి వెళ్ళిపోయాడు. జరిగిన విషయం బయటకు వస్తుందని ఒక నైలాన్ తాడుతో భార్య కళావతి ప్రియుడు రవీందర్‌లు కలిసి మృతుడి మెడకు ఉరేసి ఇంట్లోని దూలానికి వేలాడదీసి ఉరేసుకున్నట్లు నమ్మించే ప్రయత్నం చేశారు. రవీందర్ అన్న ఫిర్యాదు మేరకు కేసు విచారించి మృతుని హత్య చేసినట్లు నిర్ధారించి నిందితురాలు కళావతి నిందితుడు రవీందర్‌లను అరెస్టు చేసి రిమాండ్‌కు పంపినట్లు సిఐ తెలిపారు.

ఐటిఐ మొదటి దఫా అడ్మిషన్స్‌కు దరఖాస్తుల స్వీకరణ

నవతెలంగాణ-మందమర్రి

ప్రభుత్వ ఐటిఐ కళాశాల మందమర్రి నందు ఆగస్టు 2024 ఎస్‌సీవీటీ ప్యాట్రాన్ క్రింద ఐటీఐ ఇంజనీరింగ్ నాన్ ఇంజనీరింగ్ ట్రేడ్స్‌లలో మొదటి దఫా అడ్మిషన్లు ఆన్‌లైన్ దరఖాస్తులను స్వీకరిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ జి దేవానంద్ శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఐటీఐ. తెలంగాణ.జీఓవీ.ఇన్ వెబ్‌సైట్‌లో నిజ ధ్రువపత్రాలతో ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. మొదటి దఫా అడ్మిషన్ల రిజిస్ట్రేషన్‌కి చివరి తేది మే 16 నుంచి జూన్ 10 వరకు దరఖాస్తు చేసుకోవాలని, రూ. 100 వెరిఫికేషన్ రుసుము చెల్లించి ఐటిఐ, ట్రేడ్‌ల ప్రాధాన్యతను వెబ్ ఆప్షన్స్‌లో పెట్టుకోవాలన్నారు. మెరిట్ ప్రాతిపదికన మాత్రమే సీట్లు కేటాయించబడతాయని, దరఖాస్తు చేస్తున్నపుడు అభ్యర్థి వివరాలు ఎస్ఎస్‌సీ మెమో ప్రకారం నమోదు చేసుకోవాలని సూచించారు. అర్హులైన అభ్యర్థులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కళాశాల ప్రిన్సిపాల్ జి దేవానంద్ తెలిపారు.

నకిలీ పత్తి విత్తనాలు విక్రయిస్తే కఠిన చర్యలు

నవతెలంగాణ-తాండూర్

రైతులకు నకిలీ పత్తి విత్తనాలను అంటగట్టి సొమ్ము చేసుకునే దళారులపై కఠిన చర్యలు తీసుకుంటామని ఏసీపీ రవికుమార్ తెలిపారు. శనివారం స్థానికంగా ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. నకిలీ విత్తనాల అమ్మకాలు జరిపితే పీడీ యాక్ట్ పెట్టడానికి కూడా వెనకడబోమని తెలిపారు. బెల్లంపల్లి ప్రాంతంలో నకిలీ పత్తి విత్తనాల విక్రయాలను అరికట్టే విధంగా నిఘా వ్యవస్థను పటిష్టం చేశామన్నారు. నకిలీ పత్తి విత్తనాల విక్రయదారుల గురించి సమాచారం తెలిసినట్లయితే పోలీసులకు సమాచారం అందించాలని కోరారు. సమాచారం అందించిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతామని పేర్కొన్నారు. బెల్లంపల్లి, తాండూర్, మందమర్రి సర్కిల్ పరిధిలో నకిలీ పత్తి విక్రయదారులను, పాత నేరస్తులను గుర్తించి సత్ప్రవర్తన కోసం తహసీల్దార్‌ల వద్ద బైండోవర్ చేశామన్నారు. వ్యవసాయ శాఖ అధికారులతో సమన్వయం చేసుకుంటూ నకిలీ పత్తి విత్తనల విక్రయాలపై అడ్డుకట్ట వేయడానికి ఉమ్మడి టాస్క్ ఫోర్స్ టీమ్‌ను ఏర్పాటు చేసినట్లు తెలిపారు.

రైస్ మిల్లులను తనిఖీ చేసిన ఆర్డీఓ



నవతెలంగాణ-జన్నారం

మండలంలోని రైస్ మిల్లులను మంచిర్యాల ఆర్డీఓ రాములు తనిఖీ చేశారు. శనివారం మండలంతో పాటు పలు గ్రామాల్లో ఉన్న వివిధ రైస్ మిల్లులను తనిఖీ చేసి రిజిస్టర్లను పరిశీలించారు. ప్రభుత్వానికి ఇవ్వాల్సిన బియ్యాన్ని రైస్ మిల్లుల యాజమానులు సకాలంలో అందించాలని ఆదేశించారు. ఆయనతో పాటు తహసీల్దార్ రాజ మనోహర్‌రెడ్డి, డీటీ రామ్మోహన్, ఆర్ఐ భాను ఉన్నారు.

తాండూర్ : రేషన్ బియ్యం అక్రమ కొనుగోలు, రవాణా అభియోగంపై శనివారం తాండూర్ డిప్యూటీ తహసీల్దార్ ప్రసాద్ రేచిని గ్రామంలోని వాసవిమాత రైస్ మిల్లును తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మిల్లర్లు సేకరించిన ధాన్యం మిల్లింగ్ చేసిన బియ్యం వివరాలను స్టాక్ రిజిస్టర్లను అందుబాటులో ఉంచుకోవాలని తెలిపారు. ప్రభుత్వం అందించే రేషన్ బియ్యాన్ని కొనుగోలు చేసి తిరిగి అమ్మకాలు జరుపుతే చర్యలు తీసుకోనున్నట్లు తెలిపారు. అనంతరం ప్రాథమిక సహకార సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన రేచిని వద్ద కొనుగోలు కేంద్రాన్ని సందర్శించారు. నెలాఖరు వరకు మండలంలోని రైతుల వద్ద గల మొత్తం ధాన్యాన్ని ప్రభుత్వం కొనుగోలు చేస్తుందని తెలిపారు. ఈ తనిఖీల్లో ఏఈఓ ధనలక్ష్మి, ఎంపీటీసీ సురేష్, ఆర్ఐ మురళీధర్ రావు, సహకార సంఘం సిబ్బంది రైతులు పాల్గొన్నారు.

అంతర్గత బీటీ రహదారులను పునరుద్ధరించాలి

- ఏఐటీయూసీ బ్రాంచి కార్యదర్శి శైలేంద్ర సత్యనారాయణ

నవతెలంగాణ-మందమర్రి

అంతర్గత బీటీ రహదారులను పునరుద్ధరించాలని ఏఐటీయూసీ ఆధ్వర్యంలో సింగరేణి యాజమాన్యానికి లేఖ రాశారు. శనివారం ఏఐటీయూసీ మందమర్రి బ్రాంచి కార్యదర్శి శైలేంద్ర సత్యనారాయణ యాజమాన్యానికి పంపిన లేఖలోని అంశాలను పత్రికా ప్రకటన ద్వారా తెలిపారు. ఏరియాలోని కార్మికుల కాలనీల లోని అంతర్గత బీటీ దారులన్నీ కంకర పైకి తేలి నడవడానికి వాహనాల రాకపోకలకు ఇబ్బందిగా మారిందని, వెంటనే తారు రోడ్లను పునరుద్దరించాలని పేర్కొన్నారు. రెండు నెలల క్రితం 3వ జోన్‌లో కొంత వరకు మరమ్మత్తు పనులను చేసారని కాని 1, 2వ జోన్‌లోని రోడ్డు పనులను ప్రారంభించలేదన్నారు. వర్షాకాలం వర్షాలు పడితే రోడ్డు పనులు జరగవని సింగరేణి యాజమాన్యం సివిల్ అధికారులు తక్షణమే స్పందించి బీటీ రోడ్లను పునరుద్దరించాలని, లేని పక్షంలో ఏఐటీయూసీ ఆధ్వర్యములో ఆందోళనలు చేపడుతామని డిమాండ్ చేశారు.

బీసీ సంఘం మండల ప్రచార కార్యదర్శిగా మల్లేష్



నవతెలంగాణ-జన్నారం

బీసీ సంక్షేమ సంఘం మండల ప్రచార కార్యదర్శిగా దేవుని గూడా గ్రామానికి చెందిన వడ్లాల మల్లేశ్‌ను నియమించినట్లు ఆ సంఘం మండల అధ్యక్షుడు లక్ష్మణ్ వర్మ తెలిపారు. శనివారం బీసీ సంక్షేమ సంఘ భవనంలో సంఘ సభ్యులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. బీసీలంతా ఐక్యంగా ఉండి తమ హక్కుల కోసం పోరాటం చేయాలన్నారు. స్థానిక సంస్థల్లో 50 శాతం బీసీ రిజర్వేషన్ సాధించాలన్నారు. ఈ కార్యక్రమంలో బీసీ సంఘం మండల ఉపాధ్యక్షులు దండేవేణి శ్రీధర్, ప్రధాన కార్యదర్శి ఐలవేణి రవి, ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా కన్వీనర్ కోడూరి చంద్రయ్య, కోకన్వీనర్ కడార్ల నర్సయ్య మంచిర్యాల జిల్లా కన్వీనర్ ఆడెపు లక్ష్మీనారాయణ, నాయీబ్రహ్మణ సంఘం మండల అధ్యక్షుడు కే.నాగేందర్, రజక సంఘం మండల అధ్యక్షుడు మల్లేష్, మేరు ధర్జీ సంఘం నాయకుడు మేడిశెట్టి సంతోష్, మున్నూరు కాపు సంఘం నాయకుడు దాసరి శ్రీనివాస్ పాల్గొన్నారు.

క్రీడాకారులకు వాలీబాల్ కిట్ అందజేత

నవతెలంగాణ-జన్నారం

యువత క్రీడల్లో రాణించాలని జన్నారం గ్రామ ఉప సర్పంచ్ జంగం రవి అన్నారు. శనివారం గ్రామ పంచాయతీ పరిధిలోని గోండుగూడ యువకులకు వాలీబాల్ కిట్‌ను అందజేశారు. వేసవి సెలవుల సందర్భంగా విద్యార్థులు వ్యాయామంతో పాటు క్రీడలపై మక్కువ చూపాలన్నారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

నవతెలంగాణ-కాసిపేట

మండలంలోని పలు గ్రామాల్లో ఆదివారం విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు కాసిపేట విద్యుత్ శాఖ ఏఈ స్వర్ణలత తెలిపారు. దేవాపూర్, కోమటిచేను, ధర్మారావుపేట ఫీడర్లలో మరమ్మత్తుల కారణంగా మండలంలో కాసిపేట, చిన్న ధర్మారం, ముత్యంపల్లి, కొండాపూర్ గ్రామాలు మినహా మండలంలోని అన్ని గ్రామాల్లో ఆదివారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయడం జరుగుతుందని, వినియోగదారులు సహకరించాలని కోరారు.

ఘనంగా వాసవివీ కన్యకా పరమేశ్వరి జయంతి వేడుకలు

నవతెలంగాణ-తాండూర్

మండల కేంద్రంలోని శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి ఆలయంలో శనివారం జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఉదయం నుంచి అభిషేకం, పారాయణం, కుంకుమార్చన నిర్వహించారు. ఆలయ అర్చకులు వినాయకరావు, మాధవి దంపతుల ఆధ్వర్యంలో పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సిబ్బంది కేశెట్టి సంతోష్ కుమార్, బోనగిరి చంద్రశేఖర్, మైలారపు మధుసూదన్, రాచర్ల సురేష్, పుల్లూరి రమేష్, రేగొండ లచ్చయ్య, కాసనగొట్టు బాపూజీ, గందె సత్యనారాయణ, రేగొండ సంతోష్, చిలివేరి శివవృష్ణ, పుల్లూరి రమేష్ పాల్గొన్నారు.

ఆపరేషన్ కగార్‌ను తక్షణమే నిలిపివేయాలి

- ఆదివాసుల హత్యలపై సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలి
- సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు టి శ్రీనివాస్

నవతెలంగాణ-మంచిర్యాల

ఆర్ఎస్ఎస్, బీజేపీ ఫాసిస్టు ప్రభుత్వం గత ఐదు నెలలుగా ఆపరేషన్ కగార్ పేరుతో చత్తీస్గడ్ అడవి ప్రాంతాల్లో 120 మందికిపైగా గిరిజనులను బూటకపు ఎన్‌కౌంటర్‌లో హత్య చేసిందని ఈ హత్యలను తీవ్రంగా ఖండిస్తున్నామని సీపీఐ(ఎంఎల్) న్యూ డెమోక్రసీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు టి శ్రీనివాస్ అన్నారు. శనివారం మంచిర్యాల పట్టణంలోని మర్క్స్ భవన్‌లో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. గిరిజన మహిళలు పసి పిల్లలను క్రూరంగా కాల్చి చంపారని ఆరోపించారు. మోడీ ప్రభుత్వం 2024 చివరి వరకు దేశంలో మావోయిస్టు పార్టీని, విప్లవ సంస్థలు లేకుండా చేస్తానని ప్రకటించిందని అన్నారు. గత 58 సంవత్సరాలుగా దేశంలో పాలకవర్గాలు విప్లవ సంస్థల పార్టీలను లేకుండా చేస్తూ బూటకపు ఎన్కౌంటర్ల పేరుతో వేలాదిమందిని హత్య చేసి సంస్థలు నిషేధించిందని అన్నారు. అర్బన్ నక్సలైట్ల పేరుతో ఎన్ఐఏ, యూఏపీఏ కేసులను పెట్టి జైలుకు పంపిందని అన్నారు. పాలకవర్గాలు విప్లవ సంస్థల కార్యక్రమాలను శాంతిభద్రతల సమస్యగా చూడడం సరికాదన్నారు. విప్లవ సంస్థల భావాలు, లక్ష్యం ప్రజల ఆర్థిక, రాజకీయ, సామాజిక, సాంస్కృతిక అంశాలపై పోరాడుతుందని, ఈ దేశంలో ఆర్థిక



సమావేశంలో మాట్లాడుతున్న టి శ్రీనివాస్

అసమానతలు దోపిడీ, పీడనలు ఉన్నంతకాలం విప్లవ సంస్థలు, విప్లవ ఉద్యమాలు ఉంటాయని ఎవరు అంతం చేయలేరని స్పష్టం చేశారు. 16 రాష్ట్రాలలో విలువైన ఖనిజ సంపదను కార్పొరేట్లకు అప్పగించేందుకు బీజేపీ ప్రభుత్వం గిరిజనులపై యుద్ధం ప్రకటించి, గిరిజనులను అడవి నుంచి వెళ్లగొట్టి ఖనిజ సంపదను కార్పొరేట్లకు అప్పగించే లక్ష్యం పెట్టుకుందని అన్నారు. నిర్బంధపు బూటకపు ఎన్‌కౌంటర్లతో హత్యలు చేయడం అత్యంత దుర్మార్గమని అన్నారు. ఈ కార్యక్రమంలో ఐఎఫ్‌టీయూ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు టి శ్రీనివాస్, డి బ్రహ్మానందం, జాఫర్, పీఓడబ్ల్యూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఏ మంగ, జిల్లా అధ్యక్షురాలు ఎం జ్యోతి, అరుణ, అరుణోదయ రాష్ట్ర కోశాధికారి వి మల్లన్న, పీడీఎస్‌యూ జిల్లా కార్యదర్శి డి శ్రీకాంత్, సాజిత్ పాల్గొన్నారు.

ఉత్పత్తి ఉత్పాదకతపై ప్రభావం చూపుతుంది

- కోల్ మైన్స్ అధికారుల సంఘం అధ్యక్షుడు రమేష్



నవతెలంగాణ-మందమర్రి

అనాలోచిత చర్యలతో అధికారుల ఆత్మవిశ్వాసం దెబ్బతిని ఉత్పత్తి ఉత్పాదకత పై ప్రభావం చూపే అవకాశం ఉందని కోల్ మైన్స్ అధికారుల సంఘం అధ్యక్షులు రమేష్ తెలిపారు. కోల్ మైన్స్ అధికారుల సంఘం ఆధ్వర్యంలో శనివారం ఎస్ఓటు జీఎం రాజేశ్వర్‌రెడ్డికి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ఆర్థిక సంవత్సరంలో సింగరేణి అధికారులు ఉద్యోగులు కలిసికట్టుగా శ్రమించి 70 మిలియన్ టన్నులు బొగ్గు లక్ష్యాన్ని సాధించినట్లు తెలిపారు. దీనికి చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ ప్రతి అధికారిని, ఉద్యోగిని పేరుపేరునా అభినందించారని గుర్తు చేశారు. అలాగే సిన్సియర్‌గా పని చేసే అధికారులకు అన్ని విషయాల్లో అండగా ఉంటానని మనోధైర్యాన్ని ఇచ్చారని పేర్కొన్నారు.. కానీ ఫీల్డ్‌లో పరిస్థితిలు మరో విధంగా ఉన్నాయని ఆవేదన వ్యక్తంచేశారు. ఎస్‌టీపీపీ ఇంజనీర్ కిరిటీ ఎస్ఈ పని ఒత్తిడి, విజిలెన్స్ అధికారుల ఎంక్వయిరీ వలన ఆత్మహత్య చేసుకుంటున్నాని లేఖలో పేర్కొనడం దీనికి నిదర్శనమన్నారు. ఈ ఘటనను అధికారుల సంఘం మందమర్రి ఏరియా తరపున ఖండిస్తున్నట్లు తెలిపారు. సరైన వసతుల లేకున్నా, సంస్థ కోసం అహర్నిశలు శ్రమిస్తున్న అధికారుల పరిస్థితిని అర్థం చేసుకోకుండా, అనాలోచిత చర్యల వలన అధికారుల ఆత్మవిశ్వాసం దెబ్బతిని సంస్థ ఉత్పత్తి ఉత్పాదకతలపై కూడా ప్రభావం పడే అవకాశం ఉందని తెలిపారు. వెంటనే జరిగిన విషయంపై విచారణ జరిపి భాద్యులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. విజిలెన్స్ డిపార్ట్మెంట్‌లో సుదీర్ఘ కాలంగా పని చేస్తున్న వారిని ట్రాన్స్‌ఫర్ చేయాలని విజ్ఞప్తి చేశారు.

విద్యార్థుల స్కూల్ యునిఫాంలు సకాలంలో కుట్టివ్వాలి

నవతెలంగాణ-జన్నారం

మండలంలోని ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకుంటున్న విద్యార్థుల స్కూల్ యునిఫాంలు సకాలంలో కుట్టివ్వాలని ఎంపీడీఓ శశికళ సూచించారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకుంటున్న విద్యార్థులకు స్కూల్ యునిఫాంలు కుట్టే బాధ్యతను డ్వాక్రా మహిళా సంఘాలకు ప్రభుత్వం అప్పగించిందని తెలిపారు. దీంతో శనివారం పట్టణంలోని ఐకేపీ కార్యాలయంలో డ్వాక్రా సంఘాల మహిళలు స్కూల్ డ్రెస్సులు కుట్టే కార్యక్రమాన్ని ఎంపీడీఓ ప్రారంభించారు. సందర్భంగా వారు మాట్లాడుతూ పాఠశాలలు ప్రారంభం అయ్యేనాటికి, విద్యార్థులకు స్కూల్ యూనిఫాంలు అందించే విధంగా కుట్టి ఇవ్వాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ విజయ్ కుమార్, ఎంపీఓ రమేష్, ఏపీఎం సీహెచ్ బుజ్జన్న, కేంద్ర నిర్వాహకులు కె నాగలక్ష్మి, బి సునీత, కె సరోజ, సదాచారిదుర్గం శ్రీనివాస్,



లక్షెట్టిపేటలో..



జన్నారంలో..

మల్లేశ్వరి, కేంద్రం ఇన్‌చార్జి తేజావత్ మహేందర్ పాల్గొన్నారు.

మహిళాశక్తి కుట్టు మిషన్ కేంద్రాలు ప్రారంభం

లక్షెట్టిపేట : మండలములోని 3 మహిళాశక్తి కుట్టు మిషన్ కేంద్రాలను శనివారం ఎంపీడీఓ కె సరోజ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మండలంలోని వెంకట్రావుపేట, చందారం, జెండవెంకటాపూర్ గ్రామాల్లో కేంద్రాలను ఏర్పాటు చేశామని తెలిపారు. మండలంలోని మొత్తం రూరల్‌లో 1108 మంది విద్యార్థులు, 29 పాఠశాలలు ఉన్నాయని, వివిధ గ్రామాలలో చదువుతున్న విద్యార్థులకు ఏకరూప దుస్తులు కుట్టించే బాధ్యత స్వయం సహాయక సంఘాలకు ఇవ్వడం జరిగిందని తెలిపారు. మహిళా సంఘాలు ఆర్థికంగా ఎదగడం కోసం ఈ పని అప్పజెప్పడం జరిగింది. పాఠశాలలు ప్రారంభమైన నాటికి ఈ దుస్తులు అందించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఏపీఎం లక్ష్మి పాలొన్నారు.

కార్పొరేట్ పాఠశాలలపై చర్యలు తీసుకోవాలి

నవతెలంగాణ-నస్పూర్

కార్పొరేట్ పాఠశాలలైన నారాయణ, శ్రీచైతన్య పాఠశాలలపై చర్యలు తీసుకోవాలని తెలంగాణ బహుజన స్టూడెంట్ ఫెడరేషన్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ జాగీర్ రాజేష్ డిమాండ్ చేశారు. శనివారం టీబీఎస్ఎఫ్ ఆధ్వర్యంలో డీఈఓకు వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మంచిర్యాల జిల్లాలో కార్పొరేట్ పాఠశాలలు రోజురోజుకు పుట్టగొడుగుల్లాగా పుట్టుకొస్తున్నాయని ఎలాంటి అనుమతులు లేకుండా విద్యాశాఖ నిబంధనలను తుంగలో తొక్కుతూ తమ ఇష్టానుసారంగా స్కూల్ లు స్థాపిస్తున్నారని విమర్శించారు. శ్రీచైతన్య పాఠశాలలు మంచిర్యాల జిల్లాలలో విచ్చలవిడిగా బ్రాంచ్‌లు ఏర్పాటు చేస్తూ కనీస వసతులు పాటించకుండా తల్లిదండ్రులకు మాయమాటలు చెబుతూ పరిమితికి మించి అడ్మిషన్లు తీసుకొంటూన్నారన్నారు. అదేవిధంగా నారాయణ కార్పొరేట్ పాఠశాల, శ్రీచైతన్య పాఠశాలలు విద్యాశాఖ ప్రమాణాలను పట్టించుకోకుండా తమ ఇష్టానుసారంగా టీచర్లకు టార్గెట్లు విధించి కచ్చితంగా అడ్మిషన్లు చేస్తేనే జాబ్ ఉంటుందని వారిని మానసిక ఒత్తిడికి గురిచేస్తున్నారని తెలిపారు. ఇట్టి కార్పొరేట్ స్కూల్‌లు, ఐఐటీ, ఒలింపియాడ్, సీబీఎస్ఈ, టెక్నో, పేర్లతోటి సెపరేట్ తరగతులు నిర్వహిస్తామని తల్లిదండ్రులకు మాయమాటలు చెబుతూ అధిక ఫీజులు వసూలు చేస్తున్నారని



ఆరోపించారు. అదే విధంగా జన్మభూమి నగర్‌లోని ఎలిక్ అకాడమీ ప్లే స్కూల్ పేరుతో ఎలాంటి ప్రభుత్వ అనుమతులు లేకున్నప్పటికీ బోర్డు ఏర్పాటు చేసుకొని అడ్మిషన్లు తీసుకుంటున్నారని, కమర్షియల్ బిల్డింగ్‌లో కాకుండా నివాసం ఉండడానికి ఏర్పరచుకున్న సొంత భవనంలో పాఠశాలను నిర్వహిస్తున్నారని పేర్కొన్నారు. నర్సరీ, ఎల్కేజీ, యూకేజీ బుక్స్, అమ్ముతూ విద్యార్థుల తల్లిదండ్రులను ఆర్థిక దోపిడీకి గురి చేస్తున్నారన్నారు.

తెలంగాణ జాతీయ విద్యార్థి సంఘం ఆధ్వర్యంలో

బెల్లంపల్లి పట్టణంలోని ఇలాంటి అనుమతులు లేని అభ్యాస పాఠశాలకు అనుమతులు ఇవ్వకూడదని తెలంగాణ జాతీయ బీసీ విద్యార్థి సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎస్కే సల్మాన్ పాషా అన్నారు. శనివారం పాఠశాలపై చర్యలు తీసుకోవాలని డీఈఓకు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎలాంటి అనుమతి పత్రం లేకుండానే ఫ్లెక్సీలు ఏర్పాటు చేసి, సిబ్బంది ద్వారా అమాయక తల్లిదండ్రులను మోసం చేస్తున్నారని తెలిపారు. అధికారులు స్పందించి పాఠశాలపై పూర్తి విచారణ చేపట్టి చట్ట పరమైన చర్యలు తీసుకోవాన్నారు.. ఈ కార్యక్రమంలో నస్పూరి అఖిల్, కళ్యాణ్, రాజు పాల్గొన్నారు.

పంపిణీకి సిద్ధంగా పచ్చిరొట్ట విత్తనాలు

- వ్యవసాయ అధికారి మార్క్ గ్లాడ్సన్

నవతెలంగాణ-జైపూర్



భీమారం, జైపూర్ మండల పరిధి రైతుల సౌకర్యార్థం పచ్చిరొట్ట విత్తనాలు పంపిణీకి సిద్ధంగా ఉంచినట్లు మండల వ్యవసాయ అధికారి గ్లాడ్సన్ తెలిపారు. జైపూర్ మండల కేంద్రంలోని ఆగ్రోస్ రైతు సేవ కేంద్రం ద్వారా రైతులకు వచ్చిన విత్తనాలు పంపిణీ చేశారు. ప్రధాన పంటల సాగుకు ముందు పచ్చిరొట్ట, జీలుగ సాగు చేయడం ద్వారా ప్రధాన పంటలకు అవసరమైన సేంద్రియ కర్బనం, నత్రజని సమకూరుతుందని తెలిపారు. ఈ మేరకు వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో 60 శాతం సబ్సిడీపై పచ్చిరొట్ట జీలుగా విత్తనాలు పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. 30 కిలోల జీలుగుగా విత్తనాల బస్తాకు రూ.1116 రైతు చెల్లించాల్సి ఉంటుందని తెలిపారు. వేసవి దుక్కులతోపాటు పచ్చి రొట్ట జీలుగా సాగు చేసి పూత దశకు ముందు పంట పొలంలో కలియదున్నాలని సూచించారు. పచ్చిరొట్ట జీలుగా విత్తనాలు అవసరమైన రైతులు పట్టాదారు పాస్ పుస్తకంతో పాటు ఆధార్ కార్డు జిరాక్స్ తో వ్యవసాయ శాఖ కార్యాలయంలో సంప్రదించాలని అన్నారు.

ఎప్‌సెట్‌లో సీఓఈ విద్యార్థులకు ఉత్తమ ర్యాంకులు

నవతెలంగాణ-తాండూరు

శనివారం ప్రకటించిన ఎప్‌సెట్ ఫలితాల్లో తెలంగాణ సాంఘిక సంక్షేమ బాలుర గురుకుల సెంటర్ ఆఫ్ ఎక్స్ లెన్సీ(సిఓఈ) విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించారు. బైపీసీ విభాగంలో 24 మంది విద్యార్థులు పరీక్షకు హాజరుగా 23 మంది క్వాలిఫై అయ్యారు. వీరిలో జుమిడి ప్రణయ్ 4885 ర్యాంకుతో టాపర్‌గా నిలవగా ఎం శివకృష్ణ 7123, యార్కర్ నికిత్ 17928, గోమాస అఖిల్ 18578 ఆతరువాత స్థానాల్లో నిలిచినట్లు ప్రిన్సిపల్ ఐనాల సైదులు తెలిపారు. అదేవిధంగా ఎంపీసీ విభాగంలో 38 మంది పరీక్షకు హాజరు కాగా 37 మంది క్వాలిఫై అయ్యారు. వీరిలో వెలుతురు అఖిల్ 17133 ర్యాంకుతో కళాశాల టాపర్‌గా నిలిచినట్లు ఆయన తెలిపారు. ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులకు ప్రిన్సిపల్ ఐనాల సైదులు తోపాటుగా అధ్యాపకులు పిన్నింటి కిరణ్, శ్రీరామ వర్మ మిట్ట రమేష్, చంద లక్ష్మీనారాయణ, శోభ, కట్ల రవీందర్, అనుముల అనిరుద్, ఆకినేపల్లి రాజేష్, సుంకరి అర్జున్, ఎండీ లతీఫ్, సిబ్బంది సమందర్, తేజస్వి అభినందనలు తెలిపారు.

నిర్దేశించిన గడువులోగా పనులు పూర్తి చేయాలి

- పారిశుధ్యం లోపించకుండా చర్యలు తీసుకోవాలి
- జీపీ కార్యదర్శులకు ఎంపీడీఓ సరోజ దిశానిర్దేశం

నవతెలంగాణ-లక్షెట్టిపేట



వర్షాకాలం సమీపిస్తున్న నేపథ్యంలో మండలంలోని గ్రామాల్లో పారిశుధ్య పనులను నిర్దేశించిన గడువులోగా పూర్తి చేయాలని ఎంపీడీఓ కె సరోజ పంచాయతీ కార్యదర్శులకు సూచించారు. శనివారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీఓ ప్రసాద్‌తో కలిసి పంచాయతీ కార్యదర్శులతో పారిశుధ్యంపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ పూర్తి స్థాయిలో డ్రై వేస్ట్ కలెక్షన్ జరిగేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. సెగ్రీయేషన్ షెడ్‌లో కంపోస్టు సక్రమముగా జరిగేలా చూడాలని అలాగే కంపార్ట్మెంట్‌లో విడి విడిగా ప్లాస్టిక్, అట్టముక్కలు, గాజు సీసాలు, ఎలక్ట్రానిక్ పరికరాలు, బీరు సీసాలు, ప్లాస్టిక్ బాటిల్స్, గుడ్డలు, ఏ ఇతరత్రా వస్తువులు వేరు వేరుగా కంపార్ట్మెంట్‌లో వుండేలా ఎప్పటికప్పుడు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ముఖ్యముగా ఈ నెలాఖరులోపు ఉన్నతాధికారులు గ్రామాలను పరిశీలించేందుకు వచ్చే అవకాశం వున్నందున శానిటేషన్, సెగ్రీయేషన్, డ్రై వేస్ట్ వెట్ వేస్ట్ కలెక్షన్ జరిగేలా చూడాలని తెలిపారు. పరిసర ప్రాంతాల్లో అన్వాంటెడ్ బుషస్ లేకుండా ఎప్పటికప్పుడు క్లియర్ చేసేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. తాగు నీటి సమస్యల చేతిపంపుల వద్ద, డ్రైనేజ్ ఎప్పటికప్పుడు శుభ్రం చేచేయించాలన్నారు. ఎవరైనా నిర్లక్షంగా వ్యమహరిస్తే శాఖా పరమైన చర్యలు తీసుకోవాల్సి వస్తుందని హెచ్చరించారు.

సింగరేణి పాఠశాలల్లో సీబీఎస్ఈ సిలబస్‌ను ప్రవేశపెట్టాలి



నవతెలంగాణ-నస్పూర్

సింగరేణి పాఠశాలలో సీబీఎస్ఈ సిలబస్‌ను ప్రవేశపెట్టాలని సింగరేణి కోల్ మైన్స్ కార్మిక సంఘ్(బీఎంఎస్) రాష్ట్ర అధ్యక్షుడు యాదగిరి సత్తయ్య అన్నారు. శనివారం బీఎంఎస్ ఆధ్వర్యంలో సింగరేణి చైర్మన్ అండ్ మేనేజర్ డైరెక్టర్ బలరాంకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉత్తర తెలంగాణ కొంగు బంగారమైన సింగరేణి పరిశ్రమలో పనిచేస్తున్న ఉద్యోగుల పిల్లలకు సెంట్రల్ బోర్డ్ ఆఫ్ సెకండరీ ఎడ్యుకేషన్ (సీబీఎస్ఈ) సిలబస్ ప్రవేశపెట్టాలని, తద్వారా కార్పొరేటు అత్యున్నత విద్యను అందించే విధంగా కృషి చేయాలని కోరారు. కార్మికులు తమ పిల్లల భవిష్యత్తుకు మెరుగైన విద్య అందించేందుకు కార్పొరేట్ స్కూల్స్‌ను మరిపించే విధంగా విద్య సదుపాయాలు అందించాలని ప్రతి సంవత్సరం రూ.వేల కోట్ల లాభాలు ఆర్జిస్తున్న సంస్థ సింగరేణి కాలరీస్ కార్మికుల వేతనాల నుంచి కార్పొరేట్ స్కూల్స్ దోపిడీ చేస్తున్నాయని, క్రమశిక్షణ రాహిత్యంతో భవిత భవిష్యత్తును ఉల్లంఘిస్తున్నారని, క్రమశిక్షణ కలిగిన సెంట్రల్ సిలబస్ ద్వారా మంచి నైపుణ్యత సాధించడానికి అవకాశం ఉంటుందని తెలిపారు. ఏండ్ల తరబడి విద్య విషయంలో నిర్లక్ష్యం వహిస్తున్న సింగరేణి యాజమాన్యం కార్పొరేట్ విద్యను అందించేందుకు తక్షణమే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో శ్రీరాంపూర్ ఏరియా కార్యదర్శి నాతాడి శ్రీధర్ రెడ్డి, జైపూర్ పవర్ ప్లాంట్ ప్రధాన కార్యదర్శి దుస్స భాస్కర్, ఆర్గనైజింగ్ సెక్రటరీ బోడకుంట శ్రీధర్, జాయింట్ సెక్రటరీ, పెద్దిరెడ్డి కిషన్‌రెడ్డి పాల్గొన్నారు.